Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 19.01.2018, శుక్రవారం సంపుటి : 37 సంచిక : 33 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com



➤ పాపం బాబు...

# సీట్ల కోసం పాట్లు

➤ ప్రధానిని కలిసింది నియోజకవర్గాల పెంపుకేనా?

➤ రాష్ట్ర ప్రయోజనాలు గాలి కొదిలేసినట్లేనా?

దేవుడు ప్రత్యక్షమై ఏదైనా వరం కోరుకోమని అడిగితే విశాల దృక్పథం వున్న ఏ మనిషైనా ఏం కోరుకుంటాడు. ఈ సమాజం బాగుండాలని, సుఖసంతోషాలతో జీవించాలని కోరుకుంటాడు. సమాజం బాగుంటే అందులో ఆ వరం కోరుకున్న వ్యక్తి కూడా సంతోషంగా వుంటాడు కాబట్టి! అదే స్వార్ధపరుడైతే ఏం కోరుకుంటాడు. ఆ పూటకు మటన్ బిర్యానీనో, మద్యాన్నో లేక ఇంట్లోకి ఐశ్వర్యాన్నో కోరుకుంటాడు.

(మిగతా 11వ పేజీలో)



# జిల్లాకు జగన్

## • 23న ప్రవేశం

రాష్ట్ర రాజకీయాలలో సంచలనం సృష్టిస్తున్న వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప పాదయాత్ర ఈ నెల 23వ తేదీన నెల్లూరు జిల్లాలోకి ప్రవేశించనుంది. చిత్తూరుజిల్లాలో శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాలలో ముగిసిన అనంతరం జిల్లాలో సూళ్ళూరుపేట నియోజకవర్గం నుండి మొదలు కానుంది. పెళ్ళకూరు మండలం పెనబాక వద్ద జిల్లాలో జగన్ పాదయాత్ర ప్రారంభమవుతుంది. అక్కడనుండి నాయుడుపేట, మేనకూరు మీదుగా వెంకటగిరి నియోజకవర్గంలోకి ప్రవేశిస్తారు. వెంకటగిరి తర్వాత గూడూరు, సర్వేపల్లి, నెల్లూరు రూరల్, కోవూరు, ఆత్మకూరు, ఉదయగిరి, కావలి నియోజకవర్గాల మీదుగా జగన్ పాదయాత్ర కొనసాగనుంది.

# వికటించనున్న కులం కార్డు



> గుర్రుమంటున్న బీసీలు
> దూరమవుతున్న కాపులు
> ఆందోళనలో మత్స్యకారులు
> అసంతృప్తితో ఎస్టీలు

**గత ఎన్నికల్లో తెలుగుదేశం అధికారంలోకి రావడానికి పలు కారణాలున్నాయి. ప్రతి కారణం కూడా చంద్రబాబుకు ఎన్నో కొన్ని ఓట్లు తెచ్చి పెట్టింది. అలాంటి కారణాలలో ఒకటే కులం కార్డు.**

మనకు తెలిసిన చరిత్రలో ఎప్పుడు కూడా ఏపిలో కుల రాజకీయాలు ఉండేవి కావు. కులం, మతం కన్నా కూడా సిద్ధాంతాల పట్ల నమ్మకం, పార్టీ అధినాయకుల పట్ల అభిమానంతోనే రాజకీయాలు నడిచేవి. ఇన్నేళ్ళ చరిత్రలో కులపరంగా ప్రజలు చీలిన సందర్భాలు లేవు. నాయకుడిని లేదా ప్రభుత్వాన్ని అభిమానించినా వ్యతిరేకించినా రాష్ట్ర వ్యాప్తంగా కూడా ఫలితాల సరళి ఒకే విధంగా వుండేది. ఒక జిల్లాలో ఒక పార్టీకి, ఇంకో జిల్లాలో ఇంకో పార్టీకి అధికంగా సీట్లు రావడంమంటూ ఉండేది కాదు. 2009 ఎలక్షన్‌ల దాకా కూడా రాష్ట్రంలో ఇదే వాతావరణం కొనసాగింది.

రాష్ట్ర విభజన జరిగిన వేళా విశేషమో లేక వై.యస్.జగన్మోహన్‌రెడ్డి సొంతంగా పార్టీ పెట్టడం వల్లనో రాష్ట్రంలో కుల రాజకీయాలకు బీజం పడింది. తెలుగుదేశంకు ఒక కులం, వైకాపాకు ఒక కులం ముద్ర వేశారు. అంతకుముందు చిరంజీవి పెట్టిన ప్రజారాజ్యం పార్టీకి కూడా కులం ముద్ర వుండడం చూసాం.

అయితే 2014 ఎన్నికల్లో ఈ కులం రాజకీయాలను అందరికంటే బాగా వాడుకుంది మాత్రం చంద్రబాబే! ఈయన రాజకీయ చాణక్యం, తెలివి తేటల ముందు జగన్ చాలలేదు. పవన్ కళ్యాణ్‌ను రంగంలోకి దించడం ద్వారానేమీ, కాపు రిజర్వేషన్‌ల హామీతోనైతేనేమీ కాపుల ఓట్లను రాబట్టాడు. వై.యస్ కుటుంబంపై విషప్రచారం చేయించి క్షత్రియులను వారికి వ్యతిరేకం చేసాడు. వై.యస్. కుటుంబంపై ఎల్లో మీడియా ద్వారా మత ముద్ర వేయించి వైశ్యులు,

(మిగతా 11వ పేజీలో)



# మున్సిపాలిటీలకు ఇక మహర్దశ

**- రాష్ట్ర మంత్రి నారాయణ**



రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 110 మున్సిపాలిటీల్లో రూ.17,200 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేం దుకు అవసరమైన ప్రతి పాదనలు సిద్ధం చేసి నిధులు మంజూరుకు సీఎం నారా చంద్రబాబు నాయుడుతో చర్చించను న్నట్లు రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. ఈ నెల 16న నెల్లూరుజిల్లా నాయుడుపేట మునిసిపాలిటీలో మంత్రి పొంగూరు నారాయణ పర్యటించి ఆకస్మిక తనిఖీలు చేశారు. పట్టణంలో ఇప్పటి వరకు చేపట్టిన అభివృద్ధి, చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ప్రజాసమస్యలు తెలుసుకుంటూ ఆయన నాయుడుపేట బజారువీధిలో పర్యటించారు. చేపల మార్కెట్, కూరగాయల మార్కెట్, గడియారం సర్కిల్, పార్కు, గాంధీ మందిరం, విన్నమాల కాలువ తదితర ప్రాంతాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్న మంత్రి విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో అమృతపథకం ద్వారా లక్ష జనాభాకంటే ఎక్కువగా ఉన్న 31 మున్సిపాలిటీలకు రూ.2500 కోట్లు నిధులు, లక్ష కంటే తక్కువగా ఉన్న మిగిలిన మున్సిపాలిటీలలో రూ.3700 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయడం జరిగిందన్నారు. ఈ నెల 25, 26తేదీలలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో జరిగే ప్రత్యేక సమావేశంలో ఈ నిధుల మంజూరు విషయమై అనుమతులు పొంది అభివృద్ధికి బాటలు వేస్తామని వెల్లడించారు. రాష్ట్రంలోని 110 మున్సిపాలిటీలలో అధ్వాన్నస్థితిలో వున్న రహదారులు, డ్రైనేజీల నిర్మాణానికి ఎక్స్‌టెన్షన్ అడిషనల్ ప్రాజెక్ట్ క్రింద రూ.11,000కోట్లు మంజూరు చేయడం జరిగిం దన్నారు. రాష్ట్రంలో అధికంగా చెత్త నిల్వచేసే 20వేల ప్రాంతాలను కమాండ్ కంట్రోల్ సిస్టమ్ ద్వారా గుర్తించామన్నారు. ఇందులో 10వేల ప్రాంతాల్లో అప్పటికప్పుడే చెత్తనిల్వలు తొలగించేస్తూ వాటిని గ్రీన్ ప్రాజెక్ట్ క్రింద ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఇందుకోసం ప్రత్యేక నిధులు కేటాయించి పచ్చదనం పరిశుభ్రతకు పెద్దపీట వేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట మున్సిపల్ ఛైర్‌పర్సన్ మైలారి శోభారాణి, ఏఎంసి ఛైర్మెన్ శిరసంబేటి విజయభాస్కర్‌రెడ్డి, మైలారి రాజశేఖర్, కామిరెడ్డి రాజారెడ్డి, చదలవాడ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు రైల్వేస్టేషన్‌ల అభివృద్ధికి కృషి

**- ఎంపీ మేకపాటి**



నెల్లూరు సౌత్‌రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎంపి మేకపాటి

నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌తో పాటు చుట్టుపక్కల ఉన్న రైల్వే స్టేషన్ల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తా నని నెల్లూరు ఎంపీ మేకపాటి రాజ మోహన్‌రెడ్డి అన్నారు. నగరంలోని సౌత్ రైల్వే స్టేషన్‌ను బుధ వారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మేకపాటి మాట్లాడుతూ, రైల్వే స్టేషన్‌లలో మరుగుదొడ్లు, తాగునీరు తదితర మౌలిక వసతులు ఎంతో అవసరమని, వాటి ఏర్పాటుకు సంబంధిత అధికారులతో సంప్రదిస్తామని అన్నారు. ఈ నెల 22న దక్షిణ మధ్య రైల్వే జిఎం వినోద్‌కుమార్ నెల్లూరుకు విచ్చేస్తారని, ఇక్కడి సమస్యలు, చేయాల్సిన అభివృద్ధిపనుల గురించి ఆయనకు వివరిస్తామని ఎంపీ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ వెంట నాయకులు కర్తం ప్రతాప్‌రెడ్డి తదితరులున్నారు.

# విరుద్ధ మద్యం దుకాణాల మూసివేత

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న నెల్లూరుజిల్లాలోని నాలుగు మద్యం దుకాణాల మూసివేతకు అబ్కారీ, మద్యనిషేధక శాఖ అధికారులు రంగం సిద్ధం చేశారు. ఎక్సైజ్ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలో కొన్ని రోజులుగా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ప్రత్యేక దాడులు ముమ్మరం చేసారు. బుచ్చిరెడ్డిపాళెం పరిధిలోని సిరి వైన్స్ అనుబంధంగా నిర్వహిస్తున్న బెల్ట్ దుకాణాన్ని సీజ్‌చేసి 16 మద్యం సీసాలు, ఒక మోటార్ సైకిల్, ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. అదే క్రమంలో నిబంధన ఉల్లంఘన, నౌకర్‌నామా లేకపోవడంతో సదరు మద్యం దుకాణంపై కేసు నమోదు చేశారు. జీఎస్ నెంబర్ 129కి సంబంధించి దువ్వూరులోని బెల్ట్‌షాపును సీజ్‌చేసి వారివద్ద నుంచి 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని ఆ మద్యం దుకాణంపై కేసు నమోదు చేశారు. నాయుడుపేట పరిధిలోని జీఎస్ నెంబర్ 302కు సంబంధించిన బెల్టు దుకాణంపై దాడి చేసి 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. మనుబోలు లోని ఓ మద్యం దుకాణంపై దాడిచేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు 24 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని బెల్టు దుకాణం నిర్వాహకులతో పాటు మద్యాన్ని, ఆ బెల్టు దుకాణానికి సరఫరా చేస్తున్న పీకాక్ వైన్స్‌పై కేసు నమోదు చేసారు.

## తెల్లారక ముందే...

# వారి బ్రతుకులు తెల్లారాయి

- దారి కానరాక..మృత్యు ఒడికి
- పొగమంచుతో ప్రమాదాలు
- అయిదుగురు కన్నుమూత
- భోగిపండుగ రోజున విషాదం




పొగమంచు వల్ల దారి సరిగా కనిపిం చక జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో అయిదుగురు మృత్యువాతపడ్డారు. ఈ దురదృష్టకర సంఘటనలు ఆదివారం వేకువన జరిగాయి. ఆరోజున పొగమంచు బాగా దట్టంగా ఆవరించి ఉంది. వేకువన మరింత ఎక్కువ మంచుతో అడుగు దూరంలో ఉన్నవారు కూడా కనిపించని పరిస్థితి. అదే సమయంలో తోటపల్లి గూడూరు మండలం వెంకన్నపాళెంకు చెందిన ఒకే కుటుంబసభ్యులు, బంధువులు కలసి రెండు అద్దె కార్లలో తమిళనాడు లోని నాగూర్ నాగపట్నం బయలుదేరారు. అయితే, వారి కార్లు నెల్లూరు సమీపంలోని ఎన్టీఆర్ నగర్ వద్దకు వచ్చేసరికి పొగ మంచు కారణంగా దారి సక్రమంగా కని పించక, ముందు ఉన్న లారీ హటాత్తుగా ఆగిపోవడం గమనించకపోవడంతో, ఆ ఇన్నోవా కారు లారీని వేగంగా ఢీకొంది. దీంతో కారు సగభాగం వరకు లారీ కిం దకు దూసుకుపోయింది. దీంతో కారు టాప్ కూడా ఎగిరి దూరంగా పడింది. ఆ కారుకు యాక్టింగ్‌డ్రైవర్‌గా ఉన్న ఎస్‌కె జాఫర్(32)తో పాటు, ఆ కారులో ప్రయా ణిస్తున్న వెంకన్నపాళెం సర్పంచ్ ముత్యాల నరసమ్మ(40), పామంజి మంజులమ్మ (43) ఈ దుర్ఘటనలో అక్కడికక్కడే చని పోయారు. డ్రైవర్ పక్కసీట్లో ఉన్న ముత్యాల మల్లికార్జున, ముత్యాల అనిల్, పామంజి పోలమ్మలకు తీవ్రగాయాల య్యాయి. చివరి సీటులో కూర్చుని ఉన్న బాలుడు ముత్యాల ప్రేమసాగర్ మాత్రం ఎలాంటి గాయాలు లేకుండా బయట పడ్డాడు. ఈ కారు వెనుకనే మరోకారులో వస్తున్న బంధువులు ఈ దుర్ఘటనను గుర్తించి వెంటనే బాధితులను కారునుంచి బయటకు లాగారు. వీరిలో మల్లికార్జున పరిస్థితి విషమంగా ఉండడంతో చెన్నైకి తరలించారు. మిగిలినవారిని నగరంలోని సింహపురి ఆసుపత్రికి తీసుకువెళ్ళారు. ఈ దుర్ఘటన తెలిసిన వెంటనే ట్రాఫిక్ డీఎస్పీ మల్లికార్జునరావు, సిఐ వెంకట్రావ్, పోలీసు సిబ్బంది వెళ్ళి పరిస్థితిని పరిశీలించారు. లారీ కింద ఇరుక్కుపోయిన ఇన్నోవా కారును ఎక్స్‌కవేటర్ సాయంతో బయటకు తీసి, అందులో ఇరుక్కుపోయిన జాఫర్ మృతదేహాన్ని వెలికితీశారు. బాధితుల బంధువులు సంఘటనాస్థలికి చేరుకుని పెద్దపెట్టున రోదించారు. మరో సంఘటన కూడా దాదాపు అదే సమయంలో జరిగింది. నగరంలోని జాతీయరహ దారిపై ప్రశాంతినగర్ వద్ద పొగమంచు కారణంగా దారి సరిగా కనిపించక, ముందు వెళుతున్న బైక్‌ను కర్నాటకకు చెందిన ఓ బస్సు ఢీకొట్టడంతో, బైక్‌లో వెళ్తున్న ముగ్గురిలో ఇద్దరు అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. జాకీర్‌హుస్సేన్ కాలనీ, సింహపురి కాలనీలకు చెందిన పార్వతి వెంకటేష్(25), మేకల సుబ్ర హ్మణ్యం(37) ఈ దుర్ఘటనలో విగత జీవులు కాగా, పల్లిపాడు సుబ్రహ్మణ్యం వ్యక్తి తీవ్రగాయాలతో బయటపడ్డాడు. ఈ దుర్ఘటనలతో భోగిరోజున మృతుల కుటుం బాలు శోకసముద్రంలో మునిగిపోయాయి.

# అన్నదానం

నెల్లూరు రంగనాయకులపేటలో ఉన్న శ్రీ హజరత్ మొయునుద్దీన్‌షా ఖాదర్‌వలి దర్గాలో గంధమహోత్సవం సందర్భంగా వైఎస్సార్సీపి మైనార్టీ విభాగం నగరాధ్యక్షుడు పఠాన్ ఫయాజ్‌ఖాన్ ఆధ్వర్యంలో ఈ నెల16వ తేది రాత్రి అన్నదానం నిర్వహించారు. వైఎస్సార్సీపి నాయకుడు, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ రూప్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని అన్నదానం ప్రారంభించారు. నాయకులు మూసా, అల్లాభక్ష్, బాబు, సమీ, అజ్జు తుల్లా, హైదర్, హఫీజ్, కమల్ తదిత రులు పాల్గొన్నారు.

# ఎంపిడిఓ సస్పెండ్

సైదాపురం ఎంపిడిఓ విజయ కుమార్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ రేవు ముత్యాలరాజు ఉత్తర్వులు జారీ చేశారు. సైదాపురం మండలంలో ఉపాధి హామీ పథకం, ఆత్మగౌరవం పథకాల్లో పెద్దఎత్తున అవినీతి జరిగిందని ఆరో పణలు వచ్చాయి. కలెక్టర్ దీనిపై విచా రణకు ఆదేశించారు. ఆరోపణల్లో నిజం వుందని తేలడంతో ఎంపిడిఓను సస్పెండ్ చేశారు. ఎంపిడిఓ విజయకుమార్ గత కొంతకాలంగా సెలవులో వున్నాడు.

# ఇసుకతో ఇక్కట్లు



నెల్లూరు, జొన్నవాడ మధ్య సాఫీగా సాగిపోతున్న ప్రయాణంలో ఒక చిన్న ఆటంకం వస్తోంది. ప్రతి వాహనదారుడు ఇక్కడ ఇబ్బంది పడుతున్నాడు. ముఖ్యంగా ద్విచక్రవాహనదారులైతే అదుపు తప్పి పడిపోతున్నారు. ఇరు కళలమ్మ గుడి నుండి దొడ్ల డెయిరీ దాకా రోడ్డును నాలుగు లైన్లుగా అభివృద్ధి చేసి వున్నారు. అయితే పొట్టేపాలెం దాటాక కొంత దూరాన్ని విస్తరించలేదు. ఇక్కడే చెరువు అలుగు వస్తుంది. ఈ అలుగు మీదుగానే వాహనాలు పోతుంటాయి. ఇక్కడే పొట్టేపాలెం ఇసుకరీచ్‌కు వెళ్లే దారి వుంది. ఇసుక రీచ్ నుండి వచ్చే వాహనాలు ఇక్కడ మలుపు తిరుగుతుంటాయి. దీంతో వాహనాలలో ఇసుక కొంత జారి ఇక్కడ రోడ్డుపై పడి వుంటుంది. ఇది గుట్టలు గుట్టలుగా పేరుకుపోయి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ద్విచక్రవాహనాలలో వేగంగా వచ్చే వాళ్ళయితే ఇక్కడ అదుపు తప్పి పడిపోతుంటారు. రోడ్డుపై గుట్టగా పేరుకుపోయిన ఇసుకను వెంటనే తొలగించాల్సివుంది.

# హజ్‌యాత్ర సబ్సిడీని రద్దు చేయొద్దు

హజ్‌యాత్ర సబ్సిడీని రద్దు చేస్తూ కేంద్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని ఆలిండియా ఇమామ్స్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు హాఫీజ్ అబ్దుల్ అజీజ్, కార్యదర్శి హాఫీజ్ ఖలీల్ అహ్మద్ డిమాండ్ చేశారు. ఆ మేరకు బుధవారం నెల్లూరు కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో పాల్గొని కేంద్రప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం, జిల్లా కలెక్టర్‌కు ఆ వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు సయ్యద్ ఖాషిఫ్, ఎస్డీపిఐ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఘనీ, కార్యదర్శి ముఫ్తీ అబ్దుల్ రహమాన్, కాంగ్రెస్ నాయకుడు ఆసిఫ్‌బాషా, ఫయాజ్, జకీర్, ముస్లిం హక్కుల రక్షణ సమితి అధ్యక్షుడు అహ్మదుల్లా హుస్సేనీ తదితరులు పాల్గొన్నారు.




# మార్కెట్‌లోకి దొంగనోట్లు

**• విచ్చలవిడిగా చెలామణి • 2వేల నోట్లే అధికం**

పెద్దనోట్ల రద్దు వెనుక ప్రధాన ఉద్దేశ్యం దొంగనోట్లను అరికట్టడమేనని అప్పట్లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. బ్లాక్‌మనీ బయటకు రావడంతో పాటు దొంగనోట్ల చెలామణి ఆగిపోతుందని భావించారు. కాని నోట్ల రద్దు వల్ల బ్లాక్‌మనీని అరికట్టలేరనే విషయం చాలారోజుల క్రితమే అర్ధమైపోయింది. ఇప్పుడు దొంగనోట్లను కూడా అడ్డుకోలేమనే విషయం అర్ధమవుతోంది.

ఈ నోట్ల రద్దు తర్వాత వచ్చిన రెండు వేల రూపాయల నోట్లలో కూడా ఇప్పుడు దొంగనోట్లు వస్తున్నాయి. ఇవి మార్కెట్‌లో చెలామణి అవుతున్నాయి. వ్యక్తుల మధ్య వ్యాపార లావాదేవీలలో ఇవి చేతులు మారుతున్నాయి. అసలు నోటు ఏదో దొంగ నోటు ఏదో తెలియక లావాదేవీలలో తీసుకుంటున్నారు. బ్యాంకులలో లేదా బ్యాంకు మిషన్‌లలో వీటిని డిపాజిట్ చేసేటప్పుడు అక్కడున్న కౌంటింగ్ మిషన్లు దొంగనోట్లను పట్టేస్తున్నాయి. వంద నోట్ల కట్టలో ఒకటి రెండు దొంగనోట్లు వచ్చినా బాధితుడు ఎక్కువుగా నష్టపోయినట్లే! అసలు నోటుకు దొంగనోటుకు పట్టుకుని పరిశీలిస్తే చాలా తేడా కనిపిస్తుంది. కాని దొంగనోట్లను చెలామణిలోకి తెస్తున్న వాళ్ళు వీటిని ఒక్కొక్క నోటుగా ఇవ్వడం లేదు. అసలు నోట్ల మధ్య దొంగనోట్లను కలిపి చెలామణి చేస్తున్నారు. లావాదేవీలలో రెండువేల నోట్లు తీసుకునేటప్పుడు వాటిని జాగ్రత్తగా పరిశీలించి తీసుకోవడం మేలు. బ్యాంకర్లు, పోలీసులు కూడా దొంగనోట్లపై ప్రజలకు అవగాహన కల్పించాలి.

# కీళ్ళ మార్పిడికి 'సెల్ థెరపీ'తో చెక్




విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ వివేకానందరెడ్డి

రాష్ట్రంలోనే తొలిసారిగా నెల్లూరులోని అపోలో స్పెషాలిటీ ఆసుపత్రిలో సెల్ థెరపీ చికిత్సను అందుబాటులోకి తెచ్చినట్లు ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ వివేకానందరెడ్డి తెలిపారు. గురువారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముంబై బేస్ రీజనరేటివ్ మెడికల్ సర్వీసెస్ సంస్థ ద్వారా ఈ వైద్యవిధానాన్ని అందుబాటులోకి తెచ్చామన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న అపోలో హాస్పిటల్స్, అపోలో స్పెక్ట్రా హాస్పిటల్స్, అపోలో క్లినిక్‌లలో మొత్తం 40సెంటర్లలో ఈ సెల్ థెరపీని అందు బాటులోకి తెచ్చామని, నెల్లూరులోనే తొలిసారిగా ప్రారంభించామని చెప్పారు. 40 ఏళ్ళు దాటినవారిలో 60 నుంచి 70శాతం మంది కీళ్ళ వ్యాధులతో బాధపడుతున్నారని, ఇటువంటి వారికి కీళ్ళ మార్పిడి ఆపరేషన్ చేయడమే ఇప్పటివరకు పరిష్కారంగా ఉండేదని, కాని కీళ్ళ మార్పిడి అవసరం లేకుండానే సెల్ థెరపీ ద్వారా కీళ్ళను సాధారణ స్థితికి తెచ్చి వాటి సమస్యలను తొలగించవచ్చని పేర్కొన్నారు. మూడు నెలల కాలంలో కీళ్ళ మృదులాస్థిని పునఃసృష్టిచేయగల సత్తా ఈ సెల్ థెరపీకి ఉందని ఆయన తెలిపారు. ఆర్థరైటిస్‌తో బాధపడేవారు జాయింట్ రీప్లేస్‌మెంట్ లేకుండా ఈ సెల్‌థెరపీ చేయించుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో అపోలో యూనిట్ హెడ్ నవీన్, మెడికల్ సూపరింటెండెంట్ డా॥ శ్వేత, డా॥ చరణ్, డా॥ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## విపిఆర్ అమృతధారతో...

# ఆ గ్రామాలకు సంక్రాంతి

**• ఎర్రగుంట్ల గ్రామస్తులకు మినరల్‌వాటర్ ప్లాంట్**
**• ప్రారంభించిన ప్రముఖ దాత వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి**




విపిఆర్ ఫౌండేషన్ చేపట్టిన విపిఆర్ 'అమృతధార' కార్యక్రమం పలు గ్రామాల్లో ప్రజల దాహార్తిని తీరుస్తూ అందరి శుభాశీస్సులు అందుకుంటోంది. ఈ సత్కార్యాన్ని సంక్రాంతి పండుగలను పురస్కరించుకుని సర్వేపల్లి నియోజకవర్గంలోని వెంకటాచలం మండలం చౌటపాళెం పంచాయతీలోని ఎర్ర గుంట్ల గ్రామంలోనూ ప్రారంభించి ఆ గ్రామ ప్రజలకు నీటి కొరత లేకుండా ఏర్పాట్లు చేశారు.. ప్రముఖ దాత, విపిఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి. ఆ గ్రామ పెద్దలు వల్లూరి రమణయ్యనాయుడు, కోదండరామనాయుడు, సర్పంచ్ పోలయ్య చేతులమీదుగా, వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి సమ క్షంలో ఈ కార్యక్రమం ఇటీవల ఘనంగా జరిగింది. అమృతధార కార్యక్రమం క్రింద ఆ గ్రామంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు ఆర్‌ఓ మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా తొలుత వేమిరెడ్డి ప్రభాకరరెడ్డికి గ్రామంలోని విపిఆర్ వికాస్ యూత్ ఆధ్వర్యంలో యువకులు, ప్రజలు ఆత్మీయస్వాగతం పలికారు. గ్రామమంతా కూడా ఈ సంక్రాంతి సంబరాల్లో భాగంగా ముగ్గుల పోటీలు, గొబ్బెమ్మల ఆటపాటలతో హోరెత్తిం చారు. ఆ తరువాత ఏర్పాటుచేసిన సభలో విపిఆర్ మాట్లాడుతూ, విపిఆర్ ఫౌండేషన్ ద్వారా మన గ్రామాల్లోని ప్రజలకు ఈ సంక్రాంతి పండుగ సమయంలో మినరల్ వాటర్‌ను అందివ్వడం తనకెంతో ఆనందంగా ఉందన్నారు. ఇదో గొప్ప అనుభూతి అని, ఈ పండుగ వాతావరణంలో గ్రామీణ ప్రజల ఆత్మీయత ఆదరాభిమానాల మధ్య ఈ కార్యక్రమం జరగడం ఎంతో సంతోష కరమన్నారు. ఈ అమృతధార కార్యక్రమంలో శుద్ధి చేసిన మంచి నీటిని ప్రజలకు అందించడం ద్వారా ప్రజలకు సేవచేసే అపూర్వ అవకాశంగా తాను భావిస్తున్నానన్నారు. గ్రామపంచాయతీలు, ప్రజల అభ్యర్థన మేరకు విపిఆర్ అమృతధార కార్యక్రమాన్ని అందరి సహకారంతో విజయవంతంగా కొనసాగిస్తున్నామన్నారు. ముఖ్యంగా ఫ్లోరైడ్, టిడిఎస్ వంటి నీటి సమస్యలతో ఇబ్బంది పడుతున్న గ్రామీణ ప్రజలకు, ఇతర అసమానతలతో బాధలు పడుతున్న ప్రాంతాల్లోని ఎంపిక చేసిన గ్రామాల్లో మినరల్ వాటర్‌ప్లాంట్‌లను ఏర్పాటుచేస్తున్నామని, దీనికి ప్రజల నుంచి పెద్దఎత్తున అపూర్వమైన స్పందన లభిస్తోందని, ఇదే స్ఫూర్తితో జిల్లావ్యాప్తంగా వాటర్‌ప్లాంట్‌లను ఏర్పాటు చేయడానికి అవసరమైన ప్రణాళి కలను రూపొందించామన్నారు. ఈ సందర్భంగా ఆయన యువతను ఉద్దేశించి మాట్లాడుతూ, యువతను క్రీడల్లో బాగా ప్రోత్సహించాలనే ఉద్దేశంతో విపిఆర్ వికాస్ కార్యక్రమాన్ని రూపొందించామ న్నారు. ఈ కార్యక్రమం ద్వారా యువత క్రీడల్లో రాణించేందుకు అవసరమైన క్రికెట్ కిట్‌లను, వాలీబాల్ కిట్‌లను అందజేస్తు న్నామన్నారు. యువతలో ఉన్న క్రీడానైపు ణ్యాన్ని ప్రోత్సహించి, వారు ప్రతిభతో రాణించే విధంగా సహకరిస్తున్నామన్నారు. జిల్లాలోని ప్రజలందరూ ఈ ఫౌండేషన్ ద్వారా అమలవుతున్న కార్యక్రమాలను అందిపుచ్చుకోవాలని ఆయన కోరారు. అనంతరం యువతకు క్రికెట్, వాలీబాల్ కిట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో విపిఆర్ ఫౌండేషన్ సిఇఓ ప్రొ.వి.నారా యణరెడ్డి, విపిఆర్ ఫౌండేషన్ చీఫ్ కో–ఆర్డినేటర్ ఎన్.శంకర్, సింహపురి హాస్పిటల్స్ అధినేత కె.రవీంద్రరెడ్డి, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి తదితరులతో పాటు గ్రామప్రజలు, విపిఆర్ వికాస్‌యూత్ సభ్యులు పాల్గొన్నారు.



రంగవల్లులతో విపిఆర్‌కు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు



క్రికెట్ కిట్లు పంపిణీ చేస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

# గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

**- జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు**

జనవరి 26వ తేదిన భారత గణతంత్ర దినోత్సవాన్ని ఎంతో ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రేవు ముత్యాలరాజు అధికారులను ఆదేశించారు. గణతంత్ర దినోత్సవానికి పటిష్ట మైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఈనెల 17న జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశమై, ఈ ఏర్పాట్లకు సంబంధించిన పనులను సంబంధిత శాఖల అధికారులకు అప్పగించారు. వేడుకల్లో ప్రదర్శించే శకటాలు, ప్రదర్శనలు అందరూ ఆకట్టుకునేలా ఉం డాలన్నారు. దేశభక్తి ఇనుమడించేలా సాంస్కృతిక కార్యక్రమాలు ఉండాలన్నారు. గణతంత్ర వేడుకలను నెల్లూరు ఆర్డీఓ హరిత పర్యవేక్షించాలని సూచించారు. వివిధ శాఖల్లో ఉత్తమ ప్రతిభను కనుపరచిన ఉద్యోగులకు ఇచ్చే అవార్డుల సంఖ్య 160కి మించ



కుండా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఏఎండి ఇంతియాజ్, డిఆర్ఓ వి. వెంకటసుబ్బయ్య, ఆర్డీఓ హరిత తదితరులు పాల్గొన్నారు.



## 'ప్రభా'తం

ప్రపంచంలోనే అతిపెద్ద రక్షణ రంగ నైపుణ్యం ఉన్న ఇజ్రాయెల్‌తో భారత్ సంబంధాలు మునుపటి కన్నా మరింతగా బలోపేతం అవుతుండడం ఎంతైనా సంతోషకరం. ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమెన్ నెతన్యాహు భారత్ పర్యటన ఇరుదేశాల స్నేహాన్ని సుదృఢం చేస్తూ ముందుకు సాగుతుండడం ఎంతో ఆనందదాయకం. మన ప్రధాని నరేంద్రమోడీ ప్రోటోకాల్‌ను సైతం పక్కనపెట్టి నేరుగా స్వయంగా విమానాశ్రయానికి వెళ్ళి నెతన్యాహును ఆలింగనం చేసుకుని స్వాగతం పలికి ఇజ్రాయిల్ పట్ల భారత్‌కు ఉన్న మైత్రీభావాన్ని, ప్రేమాభిమానాలను చాటుకున్నారు. అయితే, ఈ అంశం పట్ల కాంగ్రెస్‌తో పాటు వామపక్షాలు విమర్శనాస్త్రాలు సంధించినా ప్రధాని మోడీ పట్టించుకోలేదు. అయినా, ఒక మంచి మిత్రుడు, అందులోనూ కష్టకాలంలో ఆదుకునే మిత్రుడు మనదేశానికి వచ్చినప్పుడు ఎల్లలెరుగని స్నేహాభిమానం ప్రకటించుకోవడంలో తప్పేమిటి?.. ఇజ్రాయెల్‌తో గత కొంతకాలంగా భారత్‌కు మంచి అనుబంధం ఉంది. అదికూడా సుదృఢమవుతోంది. ఇప్పుడు రక్షణ రంగానికి సంబంధించి భారత్‌తో పలు కీలకమైన ఒప్పందాలు చేసుకోవడం, తద్వారా రక్షణ విషయంలో భారత్ మరింత పటిష్టమై ఏ దేశానికి తీసిపోని విధంగా ధీటుగా నిలిచేందుకు ఇజ్రాయెల్ దేశాధినేత నెతన్యాహు సహకరిస్తుండడం భారత్‌కు ఎంతైనా శుభపరిణామం. అంతేకాదు, గతంలో భారత్ కష్టకాలంలో ఉన్నప్పుడు కూడా ఇజ్రాయెల్ ఎంతగానో సహకరించింది.

1999లో కార్గిల్ యుద్ధసమయంలో భారత్‌కు ఇజ్రాయెల్ అడగకుండానే తన సహాయ సహకారాలు అందించడమంటే చిన్నవిషయమేమీ కాదు. పాక్ హిమాలయ పర్వతాల్లో అత్యంత ప్రమాదకరమైన ప్రాంతంలో భారత్‌పైకి దాడికి దిగింది. ఆ ప్రాంతానికి అప్పటికప్పుడు అత్యంత వేగంగా ఆయుధాలు చేరవేయాలంటే ఎంతో కష్టం కూడా. అలాంటి కష్టసమయంలో ఇజ్రాయెల్ తనంత తానుగా భారత్‌కు సాయం అందించేందుకు ముందుకు రావడం ఎంతో విశేషం. కష్టంలో ఉన్నప్పుడు ఆదుకునేవాడే అసలైన మిత్రుడని పెద్దలంటారు. అంతటి కష్టంలో ఆదుకున్న మిత్రదేశం ఇజ్రాయెల్. అంతేకాదు, అంతకుముందు 1977లో ఇండో-పాక్ యుద్ధంలో కూడా ఇజ్రాయిల్ భారత్‌కు మద్దతుగా నిలబడింది. అంతటి స్నేహశీలి అయిన ఇజ్రాయెల్ దేశాధినేతను మైత్రీభావంతో ప్రధాని మోడీ ఎంతో ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని ఘనంగా స్వాగతించి ఇజ్రాయెల్ పట్ల భారత్‌కు ఉన్న ప్రేమాభిమానాలను చాటుకోవడం ఎంతైనా అభినందనీయం.

అరబ్ దేశాలకు ఎదురొడ్డి తన కాళ్ళమీద తాను నిలబడుతూ, అత్యద్భుతమైన సాంకేతిక పరిజ్ఞానంతో, విశేషమైన ప్రజ్ఞాపాటవాలతో అంచలంచలుగా ఎదుగుతోంది ఇజ్రాయెల్. అయితే, ఇజ్రాయెల్‌తో స్నేహం చేస్తే అరబ్బు దేశాలు మనకు వ్యతిరేకమవుతాయేమోననే సందేహంతోనే దాదాపు నాలుగున్నర దశాబ్దాలపాటు భారత్ ఇజ్రాయెల్‌కు దూరంగానే ఉండేది. అయితే ఆ తర్వాత కాలంలో 1992 ప్రాంతం నుంచి ఇజ్రాయెల్-భారత్ సంబంధాల్లో మార్పులు వచ్చాయి. 2003లో ఇజ్రాయెల్ ప్రధాని ఏరియల్ షారోన్ తొలిసారిగా భారత్‌కు వచ్చినప్పుడు అప్పటి ప్రధాని వాజ్‌పేయి కూడా ఆ పర్యటనకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చారు.

ఆ తర్వాత, గత ఏడాది ప్రధాని మోడీ తొలిసారిగా ఇజ్రాయెల్ పర్యటనకు వెళ్ళినప్పుడు మన ప్రధానికి ఘనమైన స్వాగతం లభించింది. ఇదే విధంగా నెతన్యాహు కూడా ప్రోటోకాల్‌ను పక్కనపెట్టి స్వయంగా విమానాశ్రయానికి వచ్చి మన ప్రధానిని స్వాగతించి, ఇద్దరూ కలసి ఒకే కారులో పయనించారు. ఇప్పుడు దాదాపు 15 ఏళ్ళ తర్వాత భారత్‌కు విచ్చేసిన ఇజ్రాయెల్ ప్రధానిగా నెతన్యాహు భారత్ నుంచి ఎంతో గౌరవం అందుకుంటున్నారు.

మొత్తం ఆరురోజుల పర్యటన కోసం 130 మంది ప్రతినిధుల బృందంతో భారత్‌కు విచ్చేసిన నెతన్యాహు, భారత్‌తో కలసి పలురంగాల్లో అభివృద్ధికి బాటలు వేస్తున్నారు. ఇరుదేశాలకు ఇవి మేలుబాటలే. ముఖ్యంగా చమురు, సహజవాయు రంగం, వైమానిక రవాణా, వ్యవ సాయం, సాంకేతిక రంగం, భద్రతా రంగం, సైబర్ భద్రత తదితర రంగాల్లో అభివృద్ధికి ఇరుదేశాలు కలిసి తొమ్మిది అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేసు కోవడం ఎంతైనా శుభపరిణామం.

అదేవిధంగా ఇజ్రాయెల్ రక్షణ సంస్థలు భారత్‌తో కలిసి ఉత్పత్తులు ప్రారంభించాలన్న ప్రధాని మోడీ ఆకాంక్ష ఇరుదేశాలకు ఆనందకరమైనదే. ఇలా భారత్-ఇజ్రాయెల్‌ల స్నేహానుబంధం మరింతగా పటిష్టం అవుతుండడం, ఇరుదేశాల అభ్యున్నతికి ఎంతైనా ఉపయోగకరమే.

అయితే, అంతర్జాతీయ స్థాయి రాజకీయాల్లో పరిస్థితులను బట్టి ఏ ఒక్కదేశానికో పూర్తిగా అనుకూలంగా వ్యవహరించడం భారత్ వంటి దేశాలకు సాధ్యం కాదు కనుక, జెరూసలేమ్‌ను రాజధానిగా గుర్తించడాన్ని వ్యతిరేకించే ఐరాస తీర్మానంపై భారత్ ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా ఓటేయడం జరిగింది. అయినా, ఆ విషయాన్ని నెతన్యాహు తప్పు పట్టలేదు. సరికదా దాని వల్ల భారత్-ఇజ్రాయెల్ మధ్య సంబంధాలకు ఎలాంటి చేటు జరగదని నెతన్యాహు ప్రకటించారు కూడా. ఇదీ స్నేహమంటే.

అంతర్జాతీయ స్థాయిలో చుట్టూ ఉన్న పరిస్థితులను ఎప్పటికప్పుడు అవగాహన చేసుకుని మసలుకుంటూ, స్నేహబంధాన్ని పటిష్టం చేసుకుంటూ ముందుకు సాగడమే మంచి స్నేహితుల లక్షణం. ఇప్పుడు భారత్-ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న మైత్రీ ప్రస్థానం సరిగ్గా ఇలాంటిదే. ఈ స్నేహం ఇరుదేశాల మధ్య ఇలాగే కలకాలం కళకళలాడుతుండాలని కోరుకుందాం.

భారత్ - ఇజ్రాయిల్ మైత్రీవనం మరింత ప్రగతి పుష్పాలతో పరిమళ భరితం కావాలని, ఇరుదేశాలు సమన్వయంతో కలసిమెలసి అభివృద్ధిపథంలో ముందుకు సాగాలని మనసారా ఆశిద్దాం!...

### ఆదుకునే మిత్రుడు



ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమెన్ నెతన్యాహు భారత్ పర్యటన ఇరుదేశాల మధ్య మైత్రీభావాన్ని పెంపొందింపజేస్తోంది. ప్రపంచంలోనే అతిపెద్ద రక్షణరంగ నైపుణ్యం ఉన్న ఇజ్రాయిల్‌తో భారత్ సంబంధాలు ఇలా మరింతగా బలోపేతం అవుతుండడం సంతోషకరం. భారత్‌తో కలసి పలు రంగాల్లో అభివృద్ధికి బాటలు వేస్తూ తొమ్మిది అవగాహన ఒప్పందాలపై సంక్రాంతి పర్వదినాన ఇరుదేశాలు సంతకాలు చేయడం ఎంతైనా శుభపరిణామం. ఈ మైత్రి ఇలాగే కలకాలం సాగుతుందని ఆశిద్దాం.

## సింహపురిలో మకరజ్యోతి దర్శనం

నెల్లూరు వేదాయపాళెంలోని స్వామి అయ్యప్ప దేవస్థానం ఈ నెల 14న 'ఓం స్వామియే శరణం అయ్యప్ప' నామస్మరణతో పులకించింది. మకర సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని శబరిమల సంప్రదాయాన్ని అనుసరించి మకరజ్యోతి దర్శనం జరిగే సమయంలో అయ్యప్ప స్వామి దేవస్థానంలో మకరజ్యోతిని వెలిగించారు. మకరజ్యోతి దివ్యదర్శనంతో భక్తులు పరవశించిపోయారు. ఆలయ ప్రధాన అర్చకులు మేల్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో స్వామి వారికి ఉదయం 5 నుంచి 6 గంటల వరకు నిర్మాల్యదర్శనం, గణపతి హోమం, ఉషఃపూజ నిర్వహించారు. 6గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నెయ్యాభిషేకం, నవద్రవ్య అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం మహాదీపారాధన, 6.45గంటలకు మకర విళక్కు (శబరిమలలో జ్యోతిదర్శన సమయం) దర్శనం నిర్వహించారు. ఈ కార్యక్రమాలను స్వామి అయ్యప్ప సేవాసమాజం అధ్యక్షుడు పి.టి.రంగరాజన్, పాలక మండలి సభ్యులు పర్యవేక్షించారు.



మకర జ్యోతిని వెలిగిస్తున్న అర్చకులు

### రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల్లో నెల్లూరుకు పతకాలు

ప్రకాశం జిల్లా టంగుటూరు క్యాండీ ఫోర్ట్‌లో ఈ నెల 10వ తేదీ నుంచి జరిగిన రాష్ట్రస్థాయి 4వ జూనియర్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో నెల్లూరు క్రీడాకారులు ప్రతిభ చాటి పతకాలు సాధించారని జిల్లా అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి శివయ్య తెలిపారు. జిల్లా క్రీడాకారులు ఎన్.రాజేష్(74కిలోలు) బంగారు పతకాన్ని, నాగూరయ్య(55కిలోలు) వెండిపతకం, డి.సృజన్(60కిలోలు) రజతపతకం, షేక్ సమీర్(97కిలోలు) రజత పతకం సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన క్రీడాకారులను అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కోట రమేష్‌బాబు, అధ్యక్షుడు చెవుల యుగంధర్ అభినందించారు.

### భక్తిశ్రద్ధలతో గోపూజ

తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 12న నెల్లూరు, వేదాయపాళెం మహాత్మాగాంధీనగర్‌లో ఉన్న శ్రీకృష్ణ మందిరంలో గోపూజా మహోత్సవం జరిగింది. ధనుర్మాసం పుణ్యదినాల సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు గోపూజతో పాటు, గోదాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు గోవులకు పసుపు కుంకుమలు పెట్టి ఆరాధించారు. గోవులకు ఆకుకూరలు, అరటిపండ్లు సమర్పించి, కర్పూరహారతులిచ్చి పూజించారు.

### కిమ్స్‌కు స్వచ్ఛ పురస్కార్

నెల్లూరులోని కిమ్స్ ఆసుపత్రికి స్వచ్ఛ పురస్కారం లభించింది. స్వచ్ఛ సర్వేషన్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ నగరానికి కృషి చేస్తున్న కిమ్స్ ఆసుపత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిరినాయుడుకి నెల్లూరు నగరపాలక సంస్థ స్వచ్ఛ పురస్కారాన్ని ప్రదానం చేసినట్లు ఆసుపత్రి యాజమాన్యం ఒక ప్రకటనలో పేర్కొంది.





### ప్రమాదకరంగా పిల్లల ఆలోచనలు

ఈ తరం పిల్లల ఆలోచనలు ప్రమాదకరంగా వుంటున్నాయి. నెల్లూరు నగరంలోనే నివాసిత ప్రాంత వీధులలో క్రికెట్, ఫుట్‌బాల్, కాట్‌బాల్ ఆడుతూ గృహస్థులకు ఇబ్బంది కలిగిస్తున్నారు. ఇదేమని ప్రశ్నించిన వారిపై దౌర్జన్యానికి దిగుతున్నారు. కొన్ని వీధులలో యువకులు బ్యాచ్‌లుగా ఏర్పడి అల్లరి చేస్తున్నారు. వీరివల్ల వీధుల్లో వెళ్ళే వాహన దారులు, పాదచారులకు చాలా ఇబ్బందిగా వుంటోంది. పోలీసులు ఇలాంటివారిపై దృష్టి సారించాలి. వారి ఆగడాలను నియంత్రించాలి.

– బాధితులు, నెల్లూరు.

### తిక్క కుదిరింది!

నాక్కొంచెం తిక్కుంది... అని చెప్పుకునే పవన్ కళ్యాణ్‌కు 'అజ్ఞాతవాసి' సినిమా అట్టర్‌ఫ్లాప్‌తో తిక్క కుదిరింది. నాలుగైదు సినిమాల హిట్లకే ఆయన కళ్ళు తలకెక్కాయి. చిరంజీవి కంటే తానే గొప్ప నటుడన్నట్లు ఫీలైపోతున్నాడు. 150 సినిమాలు చేసిన చిరంజీవిలోనూ ఆ అహంభావం లేదు. కష్టపడి సినీ పరిశ్రమలో ఉన్నత స్థాయికి చేరిన నటుడు చిరంజీవి. ఇతని పేరు బలంతో సినిమాల్లోకి వచ్చినవాడు పవన్‌కళ్యాణ్. చిరంజీవి లేకుంటే పవన్ కళ్యాణ్ కామెడీ యాక్టర్‌గా కూడా పనికిరాడు.

ఎస్.డి.నజీర్, నెల్లూరు.

### ఏపికి గవర్నర్‌ను నియమించాలి

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక గవర్నర్‌ను నియమించాల్సివుంది. ప్రస్తుత గవర్నర్ నరసింహన్ ఉమ్మడి రాష్ట్రాల గవర్నర్ అయినప్పటికీ కేవలం తెలంగాణ గవర్నర్ మాదిరిగానే వ్యవహరిస్తున్నారు. ఏపి వైపు కన్నెత్తి చూడడం లేదు. ఇక్కడ జరిగే కార్యక్రమాలను పట్టించుకోవడం లేదు. హైదరాబాద్ ఇరు తెలుగు రాష్ట్రాలకీ రాజధాని అయినా, అది పేరుకు మాత్రమే అన్నట్లుగా వుంది. ఆయన మనకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదు. కాబట్టి ఏపికి కొత్త గవర్నర్ కావాలి.

ముక్కల సతీష్, చేవూరు.



# జగన్‌తో కోటంరెడ్డి

నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఈ నెల 12వ తేదీన చిత్తూరుజిల్లాలో ప్రజాసంకల్ప పాదయాత్రలో వున్న వై.యస్.జగన్మోహన్‌రెడ్డిని కలుసుకున్నారు. ఆరోజు ఉదయమే కోటంరెడ్డి 105రోజుల ప్రజాబాట ముగిసింది. వెంటనే శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారిని దర్శించుకుని, అనంతరం చిత్తూరుజిల్లాకు వెళ్ళి జగన్‌ను కలిసారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఆనం విజయకుమార్‌రెడ్డి, తాటి వెంకటేశ్వరరావు, బిరదవోలు శ్రీకాంత్ రెడ్డిలు పాల్గొన్నారు.

## అంతరిక్షయానంలో...
# అద్భుత సెంచరీ





అంతరిక్ష రంగంలో అగ్రదేశాలకు ధీటుగా దూసుకుపోతున్న భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) ఉపగ్రహాల ప్రయోగంలో సెంచరీ కొట్టింది. గ'ఘన' విజయాల పరంపరలో మరో మైలురాయిని దాటింది. 2018 నూతన సంవత్సరంలో తొలి ప్రయోగంగా ఈ నెల 12వ తేదీ ఉదయం 9.29గంటలకు శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుండి ప్రయోగించిన పిఎస్ఎల్వి-సి40 రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. ఈ ప్రయోగం ద్వారా 1323 కిలోల బరువుగల మూడు స్వదేశీ ఉపగ్రహాలను, 28 విదేశీ ఉపగ్రహాలను నిర్ణీత కక్ష్యలో ప్రవేశపెట్టారు. మొత్తం 31 ఉపగ్రహాలను కక్ష్యలో ప్రవేశపెట్ట డానికి 2గంటల 21 నిముషాల సమయం పట్టింది. ఇస్రో చరిత్రలో ఇంతవరకు 62 రాకెట్ల ప్రయోగాలు జరుగగా, వంద స్వదేశీ ఉపగ్రహాలను వాటి ద్వారా కక్ష్యలో ప్రవేశపెట్టారు. అలాగే దాదాపు 220 వరకు విదేశీ ఉపగ్రహాలను కక్ష్యకు చేర్చడం జరిగింది. పిఎస్ఎల్వి ప్రయోగాల సక్సెస్‌తో ఇతర దేశాలు తమ ఉపగ్రహాల ప్రయోగానికి ఇస్రోను ఎంచుకుంటు న్నాయి. దీంతో వాణిజ్యపరంగానూ ఇస్రో ముందుకు దూసుకుపోతోంది.

పిఎస్ఎల్వి-సి40 విజయం అటు ఇస్రో ఛైర్మెన్‌గా కిరణ్‌కుమార్‌కు చివరి ప్రయోగం, కొత్త ఛైర్మెన్‌గా బాధ్యతలు చేపడుతున్న శివన్‌కు తొలి ప్రయోగం. ఈ విజయం ఇద్దరికీ చిరస్మరణీయమే!

## చిలికి చిలికి...
# గాలివాన కానుందా?



- మొన్న వాకాటి... నేడు అజీజ్
- ఇద్దరూ పక్క పార్టీల నుండి వచ్చినవాళ్ళే...



***ఈ జిల్లాలో తెలుగుదేశం పార్టీకి పునాదులుగా వుండి, పార్టీ జెండాలు మోసి భుజాలు కాయలు కాసిన నాయకుల వల్ల పార్టీకి ఎప్పుడూ సమస్యలు ఎదురు కాలేదు. వారి వ్యక్తిగత ఆర్థిక లావాదేవీల వల్ల పార్టీకి చెడ్డపేరొచ్చింది కూడా లేదు. కాని, ఇతర పార్టీల నుండి అరువు తెచ్చుకున్న నాయకుల వల్లే ఇప్పుడు జిల్లాలో తెలుగుదేశం పార్టీ భ్రష్టుపట్టిపోతోంది.***

మొన్న చూస్తే ఎమ్మెల్సీ వాకాటి నారా యణరెడ్డి... బ్యాంకులకు దాదాపు 700 కోట్లు బకాయిలు... మొదటి నుండి కాం గ్రెస్ మనిషి... 2015లో కాంగ్రెస్‌లో ఇక లాభంలేదని తెలుగుదేశంలో దూరాడు. అప్పటికే బ్యాంకు బకాయిలు పక్కానికి చేరివున్నాయి. అయినా కూడా చంద్రబాబు గత ఏడాది మళ్ళీ స్థానిక ఎమ్మెల్సీ నుండి నిలబెట్టి గెలిపించాడు. ఆయనను ఎమ్మె ల్సీగా గెలిపించాక బ్యాంకు బకాయిలు, కేసులు వంటివి బయటకు రావడంతో పార్టీ నుండి సస్పెండ్ చేశారు. పార్టీ నుండి వాకాటిని సస్పెండ్ చేసారన్న పేరే గాని, ఇటీవల చంద్రబాబు జన్మభూమి సభలో ఆయన ప్రత్యక్షం కావడం చూసాం.

వాకాటి అంశం అలా వుంచితే, ఇప్పుడు మేయర్ అజీజ్ వ్యవహారం పార్టీలో భగ్గుమంటోంది. తాము స్టార్ ఆగ్రో కంపెనీకి పంపించిన 42కోట్ల రూపాయలను అజీజ్ దారి మళ్ళించా రంటూ చెన్నైకు చెందిన ప్రసాద్ జెంపెక్స్ కంపెనీ చెన్నై క్రైమ్‌బ్రాంచ్‌లో కేసు పెట్టడం తెలిసిందే! తెలుగుదేశంపార్టీలోనే ఇది కలకలం రేపుతోంది. నెల్లూరు కార్పొరేషన్ లోనే మేయర్ అజీజ్‌కు వ్యతిరేకంగా కార్పొరేటర్ల సిండికేట్ ఏర్పడివుంది. మంత్రులు పి.నారాయణ, సోమిరెడ్డిలతో పాటు ఆదాల, ముంగమూరులతో కూడా అజీజ్‌కు పడదు. వీళ్ళ అనుచర కార్పొ రేటర్లందరు కూడా అజీజ్‌కు వ్యతిరేకంగా వున్నారు. అజీజ్ వ్యక్తిగత కేసుల కోసం పార్టీని ఎందుకు భ్రష్టు పట్టించాలనేది వీరి వాదన. ఇప్పటికి వ్యక్తిగత ఆర్థిక లావా దేవీల కేసులే బయటకు వచ్చాయి. వాకాటి వంటి ఆర్థిక కేసులు బయటపడితే అజీజ్‌పై వ్యతిరేక ముఠా దాడి ముమ్మరం చేసే అవకాశముంది. అయితే ఆయనను మేయర్ పదవి నుండి దించాలనే డిమాండ్ తెరపైకి రావచ్చు. అయితే మైనార్టీ అనే రక్షణ కవచం అజీజ్‌కు వుంది. ఆ బ్రాండ్ తోనే ఆయన మేయర్ అయ్యాడు. రేపు కూడా ఈ గండం నుండి ఆ బ్రాండే కాపాడొచ్చు. ఈ విషయంలో ప్రతిపక్ష వైకాపా పార్టీ ఇంకా తల దూర్చలేదు. అజీజ్ వైకాపా బ్రాండ్ మీద వచ్చిన నాయకుడే! ఆ పార్టీకే జలక్ ఇచ్చి టీడీపీలో చేరాడు. వీళ్ళు కూడా మైనార్టీ అని చెప్పే వ్యక్తిగత విషయాల జోలికి పోలేదు.

అజీజ్ వ్యవహారంలో పార్టీ ఇబ్బంది పడకుండా పార్టీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర చాకచక్యంగా వ్యవహరించారు. అజీజ్ అమాయకుడని, ఆయన ఎవరినీ మోసం చేయలేదని, పార్టీ ఆయనకు వెన్నుదన్నుగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. జరిగిన లావాదేవీలలో అజీజ్‌కు ఏ సంబంధం లేదని తేలితే సరే సరి! అజీజ్ తప్పుందని తేలితే... ఆరోజు కూడా ఇదే విధంగా అండగా నిలుస్తారా? లేక వాకాటిని సస్పెండ్ చేసినట్లే చేస్తారా? కాలమే నిర్ణయిస్తుంది!

# సిఎంఆర్ మోటార్‌బైక్ విజేత సుశీల




లక్కీడ్రా తీసి విజేతలను ప్రకటిస్తున్న సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరులోని చందన, సిఎంఆర్ 5వ వీక్లీ డ్రాలో హీరో డీలక్స్ బైక్ విజేతగా పి.సుశీల నిలిచారు. సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఈనెల 14న డ్రా తీసారు. అలాగే డైలీ డ్రా తీసి 8గృహోపకరణాల విజేతలను ఎమ్మెల్యే ప్రకటించారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ చందన, సిఎంఆర్ అమేజింగ్ సేల్ గత 45రోజులుగా నిర్వహించి ప్రతి రోజూ మహిళలకు అవసరమైన గృహోపకరణాలు అందజేయడం ప్రశంసనీయమన్నారు. సిఎంఆర్ అధినేత మావూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ అమేజింగ్ సేల్, జోడి ఆఫర్స్‌ను విశేషంగా ఆదరించిన కస్టమర్లకు ధన్యవాదాలు తెలిపారు. కస్టమర్ల కోరిక మేరకు జోడీ ఆఫర్, అమేజింగ్ సేల్ బంపర్ డ్రా కారును ఈనెల 28వతేదీ వరకు పొడిగించామన్నారు. రాజీయాడ్స్ అధినేత మోపూరు పెంచలయ్య, మేనేజర్ వాసు, శైలేష్ పాల్గొన్నారు.






# నెల్లూరు కబుర్లు

## వెంకయ్యకు వీడ్కోలు



భారత ఉపరాష్ట్రపతి హోదాలో యం. వెంకయ్యనాయుడు ఈసారి సంక్రాంతి పండుగను సొంత మనుషులు, కుటుంబ సభ్యుల మధ్య బాగానే జరుపుకున్నారు. 11వ తేదీ ఉదయం నెల్లూరుకు వచ్చిన ఆయన 16వ తేదీ వరకు వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లోనే వున్నారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. 16వతేదీ ఉదయం తిరిగి ఢిల్లీకి బయలుదేరారు. నెల్లూరు పోలీస్‌గ్రౌండ్‌లో రాష్ట్రమంత్రి పి.నారాయణ, కలెక్టర్ రేవు ముత్యాలరాజు, ఎస్పీ పి.హెచ్‌డి రామకృష్ణ, మేయర్ అబ్దుల్ అజీజ్, బీజేపీ నాయకులు పి.సురేంద్రరెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి తదితరులు ఆయనకు వీడ్కోలు పలికారు.

## రంగనాథుడి పల్లకీ మోసిన కలెక్టర్



భోగి పండుగ రోజున జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు కుటుంబసభ్యులు శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానాన్ని సందర్శించారు. ఆలయంలో పూజలు నిర్వహించారు. అలాగే అమ్మవారిని, ప్రసన్న వెంకటేశ్వరుని దర్శించుకున్నారు. అనంతరం స్వామి వారి పల్లకీ మోసారు. ఆలయ ఛైర్మెన్ మంచికంటి సుధాకర్‌రావు, ఇ.ఓ కోవూరు జనార్ధన్‌రెడ్డిలు కలెక్టర్‌కు స్వాగతం పలికారు. వేదపండితులు కలెక్టర్ కుటుంబసభ్యులకు ఆశీస్సులందజేశారు.

## టిక్కెట్లకు ఇక్కట్లు

పండుగలు వచ్చినప్పుడు దూరాభార ప్రాంతాల్లో స్థిరపడ్డ నెల్లూరుజిల్లా వాసులు తమ గ్రామాలకు వెళ్ళడానికి ఎంతగా ఉత్సాహపడుతుంటారో, పండుగలు అయిపోయాక తిరిగి తాము స్థిరపడ్డ ప్రాంతాలకు వెళ్ళడానికి అంతే ఇబ్బంది పడుతుంటారు. వరుసగా సెలవులొచ్చినప్పుడు, పండుగరోజుల్లో బస్సులు, రైళ్లలో టిక్కెట్లు దొరకడం గగనంగా వుంటుంది. అవకాశాన్ని బట్టి ప్రైవేట్ ట్రావెల్స్ వాళ్ళయితే ప్రయాణీకులను నిలువునా దోచుకుంటుంటారు. ఈ సంక్రాంతి పండుగకు కూడా జిల్లావాసులు ఇతర ప్రాంతాల నుండి భారీగా తరలివచ్చారు. 12వ తేదీ రాత్రి హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై వంటి నగరాల నుండి నెల్లూరుకు వచ్చే బస్సులు, రైళ్ళు కిటకిటలాడాయి. 15, 16తేదీలలో తిరుగు ప్రయాణాలతో టిక్కెట్లకు డిమాండ్ ఏర్పడింది.

## కరెన్సీ కొరతతో కటకట




పండుగరోజుల్లో జనాలకు నోట్ల రద్దు నాటి పరిస్థితులు ఎదురయ్యాయి. నోట్ల రద్దు జరిగి ఏడాది దాటాక కూడా కరెన్సీ కష్టాలు తరచూ వెంటాడుతున్నాయి. వరుసగా మూడురోజులు పండుగలు రావడంతో అందరికీ డబ్బు అవసరముంటుంది. ఎక్కువమంది ఏటిఎంల ద్వారా డబ్బులు డ్రా చేస్తుంటారు. అయితే బ్యాంకులకు వరుసగా సెలవులు రావడం, ఏటిఎం మిషన్‌లలో పెట్టిన డబ్బులు అయిపోవడంతో 14, 15 తేదీలలో ఏటిఎంల ముందు 'నో క్యాష్' బోర్డులు వేలాడదీసారు. బ్యాంకులు లేక, ఏటిఎంలలో డబ్బులు లేక పండుగ ఖర్చుల కోసం ఖాతాదారులు అల్లాడారు. జిల్లాలో పండుగ మూడురోజులు సగానికిపైగా ఏటిఎంలలో డబ్బులు లేకపోవడం కనిపించింది.

### ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా...

## అందరి 'ఫ్రెండు' బలరామయ్య



నలుబోలు బలరామయ్యనాయుడుగా కంటే నెల్లూరులో కోడిగుడ్ల బలరామయ్యగా అందరికీ సుపరిచితుడు, ఎందరికో స్నేహితుడైన నలుబోలు బలరామయ్యనాయుడిని నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్టేడియం ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. అందరితో ఎంతో కలుపుగోలుగా వుండే బలరామయ్య వ్యాపార పరంగానే కాక, ప్రపంచ తెలుగు సమాఖ్య నెల్లూరు రీజియన్ కన్వీనర్‌గాను, వివిధ కళాసంస్థల సారధిగాను అందరికీ తెలిసిన మనిషి! ఎన్నో ఏళ్ళుగా నెల్లూరు ఏసి స్టేడియంలోని వాకర్స్ అసోసియేషన్‌లో వివిధ పదవులు నిర్వహిస్తూ వాకర్స్‌ను ప్రోత్సహిస్తూ అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. వాకర్స్‌కు ఆయన అందిస్తున్న సేవలు మెచ్చి ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఆయనను తమ అసోసియేషన్‌కు సారధిగా ఎంచుకున్నారు. అసోసియేషన్ సభ్యులు వినుకొండ వెంకటేశ్వర్లు, మైథిలి మనోహర్‌రెడ్డి, డి.జయరామనాయుడు, రాజారావు, జి.వి.కృష్ణయ్య, సుబ్బారావు, గోవర్ధన్ తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు.

## ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు




సంక్రాంతి పిండివంటలు పంచి పెడుతున్న ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

నగరంలోని ఏసి స్టేడియం ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 15న సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. వాకర్స్ మిత్రులంతా కలసి ఉత్సాహంగా భోగిమంటలు వేసి, సంక్రాంతి సందర్భంగా చక్కెరతో కలిపిన జీడిపప్పు, రాగిపిండి మురుకులు, రేగుపండ్లు వగైరాలను అందరికీ పంచారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు వినుకొండ వెంకటేశ్వర్లు, కార్యదర్శి దొడ్ల జయరామయ్యనాయుడు, కోశాధికారి పిట్ల రాజారావు, సంయుక్త కార్యదర్శి ఎన్.సాయిసుబ్బారావు, ఉపాధ్యక్షులు కొండూరు సుబ్బారావు, జివి కృష్ణయ్య, కార్యవర్గసభ్యులు లక్కాకుల శ్రీనివాసులు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. నలుబోలు బలరామయ్య నాయుడు సంప్రదాయదుస్తులతో తెలుగుదనం ఉట్టిపడేలా విచ్చేసి, వాకర్స్ మిత్రుల కవితలను, జోక్‌లను వినిపించి ఆహ్లాదింపజేశారు. ఎంతో వేడుకగా జరిగిన ఈ కార్యక్రమంలో వాకర్స్ మిత్రులంతా పాల్గొన్నారు.

## నెల్లూరులో సింగం



అభిమానులనుద్దేశించి మాట్లాడుతున్న హీరో సూర్య

సింగం ఫేమ్ తమిళస్టార్ సూర్య 'గ్యాంగ్' చిత్రం విజయోత్సవ యాత్రలో భాగంగా 16వ తేదీ నెల్లూరుకు వచ్చారు. యం.జి. మాల్‌లో 'గ్యాంగ్' సినిమా ప్రదర్శిస్తున్న స్క్రీన్‌లోకి వెళ్ళి సూర్య, ఈ చిత్ర బృందం ప్రేక్షకులను పలుకరించింది. సూర్య వస్తున్నాడనే సమాచారంతో అభిమానులు పెద్దఎత్తున యం.జి మాల్‌కు చేరుకున్నారు. మాల్‌లోకి రాగానే సూర్య ప్రేక్షకులకు అభివాదం చేస్తూ థియేటర్‌లోకి వెళ్ళారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సూర్య మాట్లాడుతూ నెల్లూరంటే తనకెంతో ఇష్టమని, ఇక్కడికి రావాలంటే ఎంతో ఆనందంగా ఉంటుందని చెప్పారు. 'గ్యాంగ్' చిత్రాన్ని విజయవంతం చేసిన నెల్లూరు ప్రేక్షకులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. 'గ్యాంగ్' చిత్రాన్ని అన్ని వర్గాల ప్రజలు, అన్ని ప్రాంతాల ప్రజలు ఆదరిస్తున్నారని, నెల్లూరులో హౌస్‌ఫుల్ కలెక్షన్‌లతో ఈ సినిమా ఆడుతుండడం సంతోషంగా వుందన్నారు. ఏడాది క్రితం 'సింగం-3' సినిమా షూటింగ్ కోసం నెల్లూరు వచ్చానని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎం.జి.బి ఫెలిసిటి మాల్ డైరెక్టర్ ఎం.ఆర్.గంగాధర్, ఎస్2 సినిమాస్ మేనేజర్ మాగుంట ఆదిత్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బసవతారకం క్రికెట్ కప్ ఆవిష్కరణ

నందమూరి బసవ తారకం మెమోరియల్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి 31వ సంక్రాంతి క్రికెట్ పోటీ కప్‌ను కేంద్ర మాజీమంత్రి దగ్గుపాటి పురంధేశ్వరి ఆవిష్కరించారు. ఈ నెల 14న నిర్వాహకులు జానా గిరిబాబు ప్రకాశం జిల్లా కారంచేడులో ఆమె స్వగృహంలో ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఇందుకూరుపేట మండలం పల్లిపాడులో 31వ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు జరుగుతున్నాయి. ఈ పోటీల్లో విజేతలకు ఈ కప్‌ను అందజేయనున్నారు.

## ప్లాస్టిక్‌పై యుద్ధం చేద్దాం!

### కష్టపడుతున్న డా॥ యశోధర



గృహిణులకు కాగితం సంచులను పంపిణీ చేస్తున్న డాక్టర్ పి.యశోధర

ప్లాస్టిక్ కవర్ల వాడకంతో వచ్చే ప్రమాదాలను వివరిస్తూ ప్రజలలో అవగాహన కల్పించేందుకు ప్రయత్నిస్తున్న ఏపి గైనకాలజిస్టుల సంఘం అధ్యక్షురాలు డాక్టర్ పి.యశోధర ఈ నెల 16వ తేదీన నగరంలో ప్రచారం నిర్వహించారు. ఫతేఖాన్‌పేట, రైతుబజారు ప్రాంతంలో ఇంటింటికి కాగితం సంచులను పంపిణీ చేస్తూ ప్లాస్టిక్ కవర్లతో వచ్చే అనర్ధాల గురించి ప్రజలకు వివరించారు. ప్లాస్టిక్ కవర్ల వాడకం క్యాన్సర్‌కు మూలకారకమని చెప్పారు. ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని నిరోధించాలని ఆమె అందరినీ కోరారు.

## జడ్పీ సమావేశాలు

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 20వ తేదీ ఉదయం 10.30గంటలకు జరుగుతుందని జడ్పీ సి.ఇ.ఓ సి.హెచ్.సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు 23వ తేదీన జరుగుతాయని వెల్లడించారు.

# పల్లెగూటికి పండుగొచ్చింది!



ఏడాది పొడవునా బోసిపోయి నట్లు కనిపించే పల్లెసీమలు ఆ మూడురోజులు మీసం మెలేసాయి. ఆ మూడురోజులు నగరాలు బోసి పోయాయి. పల్లెల్లో కళకళ... నగ రాలలో వెలవెల... ఆట పాటలతో ఆత్మీయుల రాకతో సంక్రాంతి పండుగ మూడురోజులు గ్రామాలు సందడి చేసాయి.



నెల్లూరుజిల్లాలోని అన్ని గ్రామాలు, పల్లెల్లో సంక్రాంతి పండుగ మూడు రోజులు సందడిగా కనిపించాయి. 14వ తేదీ భోగి, 15వ తేదీ సంక్రాంతి, 16వ తేదీ కనుమ పండుగలను గ్రామాలలో ఘనంగా జరుపుకున్నారు. క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, ముగ్గులు పోటీలు నిర్వహించి ఆటపాటలతో సరదాగా గడిపారు. ఇక ఇవి కాకుండా పేకాట, కోడిపందేలు వంటి ప్లేయర్స్ కూడా తమ పని తాము కానిచ్చుకున్నారు. భోగి పండుగ అంటేనే మద్యం, మాంసం. పల్లె వాసులు వీటిని బాగానే ఎంజాయ్ చేశారు.

ముఖ్యంగా ఉదయగిరి, వెంకటగిరి, ఆత్మకూరు, రాపూరు ప్రాంతవాసులు బెంగుళూరు, హైదరాబాద్, చెన్నై వంటి రాష్ట్రాలలో ఎక్కువుగా స్థిరపడివున్నారు. ఇతర నగరాలలో, ఇతర రాష్ట్రాలలో, ఇతర దేశాలలో స్థిరపడ్డ వాళ్ళు కూడా ఈసారి పెద్దసంఖ్యలో సంక్రాంతి పండుగ కోసం సొంత గ్రామాలకు తరలివచ్చారు. సాంప్రదాయాలు ఉట్టిపడేలా, సరదాగా, సంతోషంగా కుటుంబసభ్యులతో కలిసి ఈ మూడు రోజులు సంబరాలు జరుపు కున్నారు.

# నిప్పులాంటి మనిషిని

## తనపై ఆరోపణలన్నీ గ్యాసేనంటున్న మేయర్ అజీజ్



చెన్నైకు చెందిన ప్రసాద్ జింపెక్స్ కంపెనీ తనపై చేసిన ఆరోపణలు నిజం కాదంటున్నాడు నెల్లూరు మేయర్ అబ్దుల్ అజీజ్. స్టార్ ఆగ్రో కంపెనీకి 42కోట్లు పంపిస్తే అజీజ్ తమ ఖాతాలకు మళ్ళించుకున్నాడంటూ చెన్నైకు చెందిన ప్రసాద్ జింపెక్స్ కంపెనీ అజీజ్‌పైన అతని సోదరుడు జలీల్‌పైన చెన్నైలోని క్రైమ్ బ్రాంచ్‌లో ఫిర్యాదు చేయడం, పోలీసులు కేసు నమోదు చేసి, మేయర్ అరెస్ట్‌కు సహకరించాలంటూ నెల్లూరుపోలీసులకు మెయిల్ ద్వారా కోరడం తెలిసిందే! అరెస్ట్ కాకుండా ముందస్తు బెయిల్‌కు దరఖాస్తు చేసుకుని, అరెస్ట్ గండం నుండి బయటపడ్డాక మేయర్ అజీజ్ ఈ నెల 16న విలేకరుల ముందుకొచ్చారు. ఆరోజు నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేను నిప్పులాంటి మనిషిని, నీతికి ప్రతి రూపాన్ని, ప్రసాద్ జింపెక్స్ కంపెనీ నాపై చేసిన ఆరోపణలలో ఆవగింజంత కూడా నిజం లేదు. రాజకీయంగా నా ఎదుగుదలను చూసి ఓర్వలేనివాళ్లే నాపై ఇలా బురద చల్లిస్తున్నారు. ప్రసాద్ జింపెక్స్ కంపెనీకి నా స్టార్ ఆగ్రో ప్రోడక్ట్స్‌ను అద్దెకు మాత్రమే ఇచ్చాను. ఆ కంపెనీ పూర్తి బాధ్యత మాదే! ప్రసాద్ జింపెక్స్ కంపెనీ వాళ్ళు 3.90 కోట్లు మా అకౌంట్‌లో వేసారు. 6.04కోట్లు రైతుల అకౌంట్‌లో వేసారు. ఆ కంపెనీ రైతులకు ఇంకా పెద్దఎత్తున బకాయిలు చెల్లించాల్సి వుంది. నాక్కూడా 1.64కోట్లు బాకీ వుంది. రైతులకు డబ్బులు కట్టాకే తమ కోల్డ్ స్టోరేజ్‌లో వున్న సరుకును తీసుకెళ్లాలని జింపెక్స్ కంపెనీకి స్పష్టం చేసాం. వాళ్ళు బకాయిలు చెల్లించకుండా ఇలా నాపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారు. వారిని తాను 42కోట్లు తీసుకుని మోసం చేసానని ఋజువు చేస్తే తాను వారికి 400కోట్లయినా చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నానని అజీజ్ చెప్పారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర అజీజ్‌కు మద్దతు పలికారు. అజీజ్ అకౌంట్లను, లావాదేవీలను పరిశీలించాక ఆయన కడిగిన ముత్యం లాంటివాడని అర్థమైందని, అందుకే పార్టీ పరంగా ఆయనకు అండగా నిలుస్తున్నామన్నారు. ఈ సమావేశంలో నగర టీడీపీ ఇన్‌ఛార్జ్ ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ డాక్టర్ జడ్.శివప్రసాద్, నుడా డైరెక్టర్ ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

### సోమిరెడ్డి అడిగాడు...

# చంద్రబాబు వదిలాడు

## శ్రీశైలం నుండి ఐదున్నర టీఎంసీలు





జిల్లాలో ఈసారి తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడం తెలిసిందే! జిల్లాలో ఎక్కడా పూర్తి స్థాయిలో చెరువులు నిండిన దాఖలాలు లేవు. ఈ దశలో ఎగువ జిల్లాల్లో కురిసిన వర్షాల మూలంగా సోమశిలకు 50 టిఎంసీలకు పైగా నీళ్ళు రావడం తెలిసిందే! వర్షాభావ పరిస్థితుల వల్ల గత ఏడాది జిల్లాలో రెండో పంట లేకుండాపోయింది. ఈసారి పంటకైనా నీళ్ళుంటాయా లేదా అని సందేహిస్తున్న పరిస్థితుల్లో సోమశిలకు నీళ్ళు రావడం, సోమశిల, కండ్లేరు ఆయకట్టు క్రింద రైతులు ఆనందంగా పంటలు వేయడం జరిగింది. ఇటీవల జరిగిన ఐఏబి సమావేశంలోనూ 5లక్షల ఎకరాలకు నీళ్లందించాలని నిర్ణయించారు.

అయితే అధికారికంగా 5లక్షల ఎకరాలకే అని చెప్పినా అనధికారికంగా మరో రెండు లక్షల ఎకరాల వరకు రైతులు నీళ్ళను వాడుకుంటుంటారు. సోమశిల, కండ్లేరులలో నీటిని సాగునీటి అవసరాలకే కాకుండా చెన్నై, తిరుపతిలకు పంపించాలి. జిల్లాలో తాగునీటి అవసరాలకు వాడుకోవాలి. డెడ్‌స్టోరేజ్‌లో కొంత పెట్టాలి. పైర్లు కోత కొచ్చే దశలో నీళ్ళు లేకపోతే చేతికొచ్చే పంటను కోల్పోయే పరిస్థితి... ఈ పరిస్థితిని వూహించే జిల్లా మంత్రి, వ్యవసాయమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఇటీవల జన్మభూమి పర్యటనకు కోడూరుపాడు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లాడు. ఆయన సానుకూలంగా స్పందించారు. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ వద్ద నుండి సోమశిలకు 5.5టీఎంసీల నీటి విడుదలకు సీఎం ఆదేశించాడు. సోమిరెడ్డి కృషితో ఈ పంటను గట్టెక్కించినట్లే!

# ఎమ్మెల్సీకి జైలు శిక్ష

విధి నిర్వహణలో వున్న సి.ఐపై దాడి చేసిన ఘటనలో తూర్పురాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసులురెడ్డికి గూడూరు ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు రెండేళ్ళ జైలు శిక్ష విధించింది. కాగా, ఎమ్మెల్సీని 12వ తేదీ రాత్రే బెయిల్‌పై బయటకు తీసుకువచ్చారు. 2011లో చిల్లకూరు మండలం అంకులపాటూరు వద్ద విఎస్ఎఫ్ పవర్ ప్లాంట్ ఏర్పాటు కోసం ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. ఇక్కడ పవర్ ప్లాంట్‌ను ప్రజాసంఘాలు వ్యతిరేకించాయి. ఈ సందర్భంగా జరిగిన నిరసనలో కొందరు సభపైకి రాళ్లు విసరడంతో అప్పుడు సి.ఐగా వున్న రాంబాబు తలకు గాయమైంది. ఈ సంఘటనలో అప్పుడు ఎమ్మెల్సీ యండపల్లితో పాటు మరో 11మందిపై 143, 147, 148, 332, 447, 290 సెక్షన్‌ల క్రింద కేసులు నమోదు చేశారు. నేరం ఋజువు కావడంతో యండపల్లి శ్రీనివాసులురెడ్డితో పాటు మిగతా 10 మంది ముద్దాయిలకు రెండేళ్ళ జైలుశిక్ష, 4700రూపాయల వంతున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి లావణ్య తీర్పు చెప్పారు.

# జీఎస్టీ ఎగవేతదారులపై చర్యలు

## - జాయింట్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి



వినియోగదారులు, వర్తక, వాణిజ్య సంఘాలవారిని దృష్టిలో పెట్టుకుని జీఎస్టీ చట్టంలో అనేకసార్లు మార్పులు చేశామని, అయితే జీఎస్టీ లక్ష్యాలను విస్మరించి కొందరు పన్ను ఎగవేతకు పాల్పడుతున్నారని, అలాంటివారిపై తగు చర్యలు తీసుకుంటున్నామని జీఎస్టీ జాయింట్ కమిషనర్ ఎస్.ఇ కృష్ణ మోహన్‌రెడ్డి తెలిపారు. నెల్లూరులోని జీఎస్టీ కార్యాలయంలో ఆయన ఈ నెల 12న విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి ఈ విషయం వెల్లడించారు. జీఎస్టీ చట్టంపై తగినంత ప్రచారం కల్పించినా కొందరు వ్యాపారులు జీఎస్టీని అలక్ష్యం చేస్తున్నారని, అలాంటివారిపై నిఘాపెట్టి డికాయ్ ఆపరేషన్ పేరుతో బిల్లులను జారీచేయని దుకాణాలపై దాడులు చేసి తగు అపరాధ రుసుం వసూలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే డివిజన్‌లో సుమారు నాలుగువందల కేసులు గుర్తించామని, రాష్ట్ర శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు వారి వద్ద అపరాధ రుసుము వసూలు చేశామన్నారు.సరైన రవాణా పత్రాలు, అమ్మకం బిల్లులు లేకుండా రవాణా చేస్తున్న వాహనాలను తనిఖీ చేసి సరుకు నిలుపుదల చేయడమే కాకుండా, భారీగా పన్ను, అపరాధరుసుము విధిస్తున్నామన్నారు. వ్యాపారులు పన్ను ఎగవేత ఆలోచనలకు స్వస్తి చెప్పి, క్రమశిక్షణతో పన్నులు చెల్లించి నిర్భయంగా వ్యాపారాలు చేసుకునే స్థితికి రావాలని, జీఎస్టీ చట్టాన్ని విజయవంతం చేయడంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు.

# ఉదయగిరి దుర్గంపై జేసీ



జిల్లా జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్ ఈ నెల 16వ తేదీన ఉదయగిరి కొండను కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. ఉదయగిరిలోని రంగనాయకుల దేవాలయం, కృష్ణాలయం, అయ్యప్పస్వామి గుడి, దుర్గంపై వున్న తొట్టి, పురాతన కోనేరులను చూసారు. అక్కడి శిలా శాసనాలను పరిశీలించారు. ఉదయగిరి దుర్గం చరిత్రను, పూర్వకాలంలో జరిగిన సంఘటనలను పురావస్తుశాఖ సిబ్బంది ఆయనకు వివరించారు.

# అలరించిన నృత్య నీరాజనం



హైదరాబాద్ పరంపర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేది నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో గుడి సంబరాలు నిర్వహించారు. ఆల్తూరు ఆదినారాయణరెడ్డి, ఆల్తూరు గిరీష్‌రెడ్డి, ఆల్తూరు మహేష్‌రెడ్డి సౌజన్యంతో నిర్వహించిన గుడి సంబరాలను రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి జ్యోతిప్రకాశనం చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బెంగుళూరు, శ్రీలంకకు చెందిన ప్రముఖ శాస్త్రీయ నృత్య కళాకారిణులు పాల్గొని పలు నృత్య రూపకాలను ప్రదర్శించి ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యాలతో ముంచెత్తారు.



కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యఅతిథులు

పరంపర వ్యవస్థాపకులు డాక్టర్ శ్రీనాగి, శశికళ, శిల్పారెడ్డి ఆధ్వర్యంలో తొలిసారిగా మన రాష్ట్రంలో ఈ నృత్య రూపకాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సోమిరెడ్డి మాట్లాడుతూ నాలుగేళ్ళుగా పరంపర నిర్వహిస్తున్న నృత్య ప్రదర్శనలు మన రాష్ట్రంలో తొలిసారి నెల్లూరులో జరపడం సంతోషదాయకమని, ఇలాంటి కార్యక్రమాలకు సహకరిస్తున్న ఆల్తూరు ఆదినారాయణరెడ్డి ఉత్తమ అభిరుచికి నిదర్శనమని పేర్కొన్నారు. నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ సంప్రదాయ నృత్యం, మన సంస్కృతి పూర్వవైభవాన్ని చాటుతుందన్నారు. మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, కోట సునీల్‌కుమార్, దేవాదాయశాఖ సహాయకమిషనర్ వేగూరు రవీంద్రరెడ్డి, కార్పొరేటర్లు, ఆలయ ప్రధానార్చకులు తంగిరాల రాధాకృష్ణశర్మ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమ వ్యాఖ్యాతగా శ్రీమణి వ్యవహరించారు.

# పద్య సారస్వత పరిషత్ ఏర్పాటు



సాహిత్యానికి పుట్టినిల్లయిన నెల్లూరుసీమలో పద్య సాహిత్యాన్ని ప్రోత్సహించే సదుద్దేశ్యంతో పద్య సారస్వత పరిషత్ ఏర్పాటైంది. ఈ నెల 12వ తేదీ స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని నెల్లూరులోని ఏసి నగర్‌లో ఉన్న శ్రీ వివేకానంద విద్యానికేతన్ హైస్కూలులో పద్య సారస్వత పరిషత్ (జాతీయసంస్థ) నెల్లూరుజిల్లా శాఖ జాతీయ అధ్యక్షుడు పద్యభారతి శ్రీ చదలవాడ లక్ష్మీనరసింహారావు ఆధ్వర్యంలో ఈ పరిషత్ ఏర్పడింది. అధ్యక్షులుగా పోలవరపు లక్ష్మీనరసింహారావు, ఉపాధ్యక్షులుగా అగస్త్యరాజు సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా డా. చీమకుర్తి వెంకటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శిగా ఊరుబిండి వెంకటసుబ్రహ్మణ్యశాస్త్రి, కోశాధికారిగా సూరం చంద్రశేఖరం ఎంపికయ్యారు. పద్య సారస్వత పరిషత్‌కు గౌరవ సలహామండలి సభ్యులుగా ఆలూరి శిరోమణిశర్మ, ఎన్.బలరామయ్యనాయుడు, గుండాల నరేంద్రబాబు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో పోలవరపు లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ, జిల్లాలోని కవిమిత్రు లందరి సహాయ సహకారాలతో ఈ సభ ఏర్పాటుచేశామంటూ వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వీరిచే రచింపబడిన 'శ్రీసూక్తి సుధ' అనే గ్రంథాన్ని పరిషత్ జాతీయ అధ్యక్షుడు చదలవాడ లక్ష్మీనరసింహారావు ఆవిష్కరించారు. సూరం చంద్రశేఖరం ఈ గ్రంథాన్ని సమీక్షించారు. ఆ తర్వాత స్వామి వివేకానందపై పద్యకవితా గానం జరిగింది. ఈ కార్యక్రమంలో మహామహోపాధ్యాయ పూర్ణానందశాస్త్రి, గోస్వామి గాజులపల్లి లక్ష్మీనరసింహారావు, భువనగిరి సోమయాజులు, పద్య కళాపరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్, వేదికకు వసతి కల్పించిన బొమ్మిశెట్టి యల్లమందయ్య పాల్గొన్నారు. డా. చీమకుర్తి వెంకటేశ్వరరావు సభా కార్యక్రమాలను నిర్వహించారు.

# ఇస్రో శాస్త్రవేత్తలకు పిఆర్ క్లబ్ అభినందనలు

శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం నుండి ఇస్రో ఛైర్మెన్ కిరణ్‌కుమార్ నేతృత్వంలో పిఎస్‌ఎల్‌వి-సి40 వాహన నౌక ద్వారా మనకు సంబంధించిన 3 ఉపగ్రహాలు, ఇతర 8 దేశాలకు సంబంధించిన 28 ఉపగ్రహాలను ఇటీవల నింగిలోకి విజయవంతంగా పంపిన మన శాస్త్రవేత్తలకు గూడూరు పిఆర్ క్లబ్ సభ్యులు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. మన దేశ ప్రతిష్టను ప్రపంచ దేశాల నలుమూలలకు వ్యాపింపజేసి మన భారతీయులు ఏ ప్రాజెక్ట్‌లోనైనా ముందుంటారని ప్రపంచానికి తెలియజేసిన మన శాస్త్రవేత్తలకు అభినందనలు తెలుపుతూ భవిష్యత్‌లో చేపట్టే కార్యక్రమాలు ముఖ్యంగా చంద్రయాన్-2 విజయవంతం కావాలని క్లబ్ అధ్యక్షులు కోడూరు శ్రీనివాసులురెడ్డి, కార్యదర్శి యల్లసిరి గోపాలరెడ్డి, ట్రెజరర్ పూడి లక్ష్మీనారాయణ, సభ్యులు శ్రీకంటి రామ్మోహన్‌రావు తదితరులు ఆశించారు.



ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలుపుతున్న శ్రీకంటి రామ్మోహన్‌రావు, పిఆర్ క్లబ్ సభ్యులు

## గూడూరు డివిజన్ వార్తలు

కాగా, పిఆర్ క్లబ్ గూడూరు ఆధ్వర్యంలో 40 సంవత్సరాలు పైబడ్డ నెల్లూరుజిల్లా టెన్నిస్ వెటరన్ క్రీడాకారులు మరియు శ్రీకాళహస్తి టెన్నిస్ వెటరన్ క్రీడాకారులకు 19, 20, 21 తేదీలలో టోర్నమెంట్ జరుగుతుందని సభ్యులు తెలిపారు.

# కోదండ రామాంజనేయుని తెప్పోత్సవం



తెప్పోత్సవానికి ముందు హోమంలో పాల్గొన్న కనుమూరు హరిచంద్రారెడ్డి, ఎమ్మెల్యే పాశం సునీల్

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రతి యేటా కనుమ రోజున నిర్వహించే కోదండరామాంజనేయ స్వామి తెప్పోత్సవం మంగళవారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. కనుమూరు హరిచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వామి వారి తెప్పోత్సవం కన్నుల పండుగగా జరిగింది. ముందుగా అర్చకులు మూలవిరాట్‌కు వేదమంత్రోచ్ఛారణ నడుమ శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కనుమూరు హరిచంద్రారెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించి ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. మంగళవాయిద్యాలు, మేళతాళాల మధ్య హంస వాహనంపై స్వామివారు కొలువుతీరి భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం కోనేటిలో హంస వాహనంపై స్వామి వారి తెప్పోత్సవం వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తెప్పోత్సవాన్ని తిలకించారు.

# తెదేపాలోకి గూడూరు కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు

గూడూరు కాంగ్రెస్‌పార్టీ పట్టణాధ్యక్షుడుగా ఉన్న వీరిబోయిన గోపాల్‌యాదవ్ ఇటీవల సూళ్ళూరుపేటలో ఫ్లెమింగో ఫెస్టివల్‌కు వచ్చిన మంత్రి నారాయణ, ఎమ్మెల్సీ బీద రవిచంద్రల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ నాయకత్వంలో 200 మంది కార్యకర్తలతో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈయన ఇంతకుముందు తెలుగుదేశంపార్టీలోనే తెలుగుయువత పట్టణాధ్యక్షుడుగా, జిల్లా ప్రచార కార్యదర్శిగా వున్నారు. అలాగే గతంలో కాంగ్రెస్‌పార్టీలో ఉంటూ గూడూరు ధర్మరాజు దేవాలయం ఛైర్మెన్‌గా పని చేశారు. తెలుగుదేశం పార్టీలో చేరిన వారిలో మాజీ మున్సిపల్ ఛైర్మెన్ కొట్టు ఉదయకుమార్, జమ్మల ప్రకాష్, బి.సుధాకర్, కన్నయ్య, గోపాల్, చిరంజీవి, వి.పి.యాదవ్ తదితరులు ఉన్నారు.



మంత్రి నారాయణ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరుతున్న గోపాల్‌యాదవ్

# ముగిసిన మాస్టర్ క్రికెట్ లీగ్ వెటరన్ పోటీలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్

గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో కనుమూరు హరిచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 3రోజుల పాటు జరిగిన మాస్టర్ క్రికెట్ లీగ్ వెటరన్ పోటీలు సోమవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు సమావేశంలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన మాట్లాడుతూ క్రీడలతో ఆరోగ్యంగా ఉండవచ్చని, స్నేహితులతో కలసి క్రీడలు ఆడడం తీపి జ్ఞాపకమన్నారు. ప్రతి ఒక్కరు సంస్కృతి సంప్రదాయాలను గౌరవించి, పండగల్లో స్నేహితులతో కలసి క్రీడలు ఆడడంవల్ల వచ్చే సంతోషం ఎంతో బాగుంటుందన్నారు. వెటరన్ క్రీడలను 10 సంవత్సరాలుగా సంక్రాంతిని పురస్కరించుకుని గూడూరులో నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రథమ బహుమతి బ్రౌన్ ఈగల్స్, ద్వితీయ బహుమతి బ్లాక్ జాగర్స్ గెలుపొందాయి. ఈ కార్యక్రమంలో గూడూరు డిఎస్పీ రాంబాబు, ఆర్డీవో అరుణ్‌బాబు, కనుమూరి హరిచంద్రారెడ్డి, శాప్ మాజీడైరెక్టర్ రవీంద్రబాబు, కె.ముని గిరీష్ తదితరులు ఉన్నారు.



**బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు**
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 19.1.2018 నుండి
తేది. 25.1.2018 వరకు

ఈ వారము కుంభ మీన మేష రాశులలో చంద్రుడు, కర్కాటక రాహువు, తులలో గురువు, వృశ్చికంలో కుజుడు, ధనుస్సులో బుధ శనులు, మకరంలో రవి శుక్ర కేతువు

**పంచాంగము:**

తేది 24 బుధవారము రథసప్తమి వ్రత దినము.
శుక్రమౌఢ్యమి జరుగుచున్నది. ముహూర్తములు లేవు.

**మాఘమాస శుక్లపక్ష తిధులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 19 | శుక్ర | విదియ | ఉ॥ గం.10.44వ॥ |
| తేది. 20 | శని | తదియ | ప॥ గం.11.58వ॥ |
| తేది. 21 | ఆది | చతుర్థి | ప॥ గం.12.43వ॥ |
| తేది. 22 | సోమ | పంచమి | ప॥ గం.12.56వ॥ |
| తేది. 23 | మంగళ | షష్ఠి | ప॥ గం.12.39వ॥ |
| తేది. 24 | బుధ | సప్తమి | ప॥ గం.11.52వ॥ |
| తేది. 25 | గురు | అష్టమి | ఉ॥ గం.10.38వ॥ |

### మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఆర్థిక లావాదేవీలందు సమస్యలు వస్తాయి. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా జరుగుతాయి. అదనపు ఖర్చులుంటాయి. ముఖ్య వ్యక్తులను కలుసుకొన వీలుకాదు. శుభకార్య ప్రయత్నాలలో కొంత అనుకూలత ఉంటుంది. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు అందుకొనే అవకాశం కలదు. ఉద్యోగులకు విధి నిర్వహణ సాఫీగా సాగుతుంది. కుటుంబసౌఖ్యము బాగుంటుంది.

### వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

వ్యాపారాలు, వృత్తి జీవనం సామాన్యంగా జరుగుతుంది. ఆదాయం ఫరవాలేదు. తొందరపాటు మాటలు, ప్రవర్తనను అదుపు చేసికొనడం మంచిది. ఆరోగ్యం ఫరవాలేదు. ఋణ బాధలు కొంత తగ్గుతాయి. బిల్లులు చెల్లింపులు జరుగుతాయి. కళ క్రీడా రంగాల వారికి ప్రోత్సాహకరంగా ఉంటుంది. ఏ విషయంలో కాని తొందరపాటు నిర్ణయాలు వద్దు.

### మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

వ్యవహారాలు ఇంట్లోనైనా, బయటవి అయినా మెలకువ వహించాలి. మొగమాటాలకు వత్తిళ్ళకు లొంగితే ఇబ్బందులు రాగల అవకాశం ఉన్నది. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి. అవసరాలకు ఋణం చేయవలసి రావచ్చును. ఆర్థికపరమైన ఇబ్బందులుంటాయి. చేపట్టిన పనులను ఎంత జాగ్రత్తగా నిర్వహించినను ఆటంకాలుంటాయి. విద్యా కృషి బాగుంటుంది.

### కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఆర్థిక పరిస్థితి మెరుగుగా ఉంటుంది. వృత్తి జీవనం కలవారికి, చిన్న చిన్న వ్యాపారవర్గాలకు ఆదాయం సంతృప్తికరము. పెద్ద వ్యాపారులకు అంత సంతృప్తి ఉండదు. బాకీలు కొంత వసూలు కాగలవు. బంధువర్గంతో స్వల్ప విభేదాలు చోటు చేసికొంటాయి. ఉద్యోగ వర్గాలు అధికారుల ఆదరణ బాగుండి బాధ్యతలు సమర్ధవంతంగా నిర్వహిస్తారు.

### సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

అనుకొన్న పనులు కొన్ని ఆకస్మికంగా నెరవేరుతాయి. వృత్తి వ్యాపారాలు అభివృద్ధికరంగా ఉండి ఆదాయం బాగుంటుంది. అయినా అదనపు ఖర్చులు కూడా వదిలిపెట్టవు. ప్రభుత్వ అనుమతులలో ఆలస్యం ఉంటుంది. పెద్ద వ్యాపారవర్గాలు, అధికారులపై అవినీతి నిరోధక అధికారుల దాడి ఉండవచ్చును. శుభకార్య ప్రయత్నాలు వాయిదా పడతాయి.

### కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఆర్థిక ఇబ్బందుల నుండి బయటపడతారు. వ్యాపార వర్గాలకు పురోగతి బాగుండి ఆదాయం పెరుగుతుంది. కొత్త పెట్టుబడులకు అవకాశాలు లభిస్తాయి. పెండింగ్‌లోని ఇబ్బందులు తొలుగుతాయి. శుభకార్య ప్రయత్నాలు ఫలించగలవు. బంధుమిత్రులను కలుసుకొంటారు. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. శుభవార్తలు వినగలరు. రావలసిన బాకీలు కొంతవరకు అందుతాయి.

### తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

కుటుంబ వ్యవహారాలలో ఇబ్బందులు రాకుండా మెలగండి. అనుకున్న పనులు నిదానంగా జరుగుతాయి. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగి ఆదాయం బాగుంటుంది. మిమ్మల్ని విమర్శించే వారుంటారు, కాని పట్టించుకోవద్దు. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు లభిస్తాయి. కొత్త వ్యాపారాలు, కొత్త నిర్మాణాలు చేపట్టే ఆలోచనలుంటాయి.

### వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఆర్థిక వ్యవహారాలలో ముందుచూపుతో చక్కగా ప్రణాళికలను ఏర్పరచుకొంటారు. వృత్తివ్యాపారాలలో రాబడి పెరుగుతుంది. తొందరపాటు నిర్ణయాలు తీసికొనే పరిస్థితి ఇతరుల వల్ల కలుగుతుంది. కాబట్టి జాగ్రత్త అవసరం. ఒకటి రెండు అనవసరపు ఖర్చులు పైనబడతాయి. స్థిరాస్తుల లావాదేవీలు కొద్దికాలం వాయిదా వేయండి. ఆరోగ్యం బాగుంటుంది.

### ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఖర్చులు పెరిగి ఆర్థిక ఇబ్బందులుంటాయి. వ్యాపార వర్గాలకు అవకాశాలు చేజారిపోవచ్చును. వృత్తి జీవనం కలవారికి, చిరువ్యాపారులకు ఫరవాలేదు. అనుకున్న పనులు సరిగా జరగక ఆలస్యం కాగలవు. కొందరి ప్రవర్తనవల్ల మనస్సుకు కష్టం కలుగవచ్చును. ఉద్యోగులకు విధి నిర్వహణలో అప్రమత్తత బాగుంటుంది. కుటుంబ సౌఖ్యము బాగుంటుంది.

### మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

మంచి ఖర్చు తగలవచ్చును. బంధువర్గం నుండి అనారోగ్య వార్తలు వింటారు. అనుకున్న పనులు నెరవేరడానికి లౌకికంగా ప్రవర్తించండి. అనుకూలంగా జరిగిపోతాయి. వ్యాపారవర్గాలకు అభివృద్ధి తగ్గి ఆదాయం కొంతవరకు తగ్గుతుంది. శాస్త్ర సాంకేతిక క్రీడా కళా రంగాల వారికి మంచి అవకాశాలు రాగలవు. కుటుంబ వ్యక్తులతో స్వల్ప విభేదాలు వచ్చి సర్దుబాటు కాగలవు.

### కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ఖర్చులు ఎక్కువైనా ఆర్థిక ఇబ్బందులు బాధించవు. వృత్తి వ్యాపార వర్గాలకు ఆదాయం పెరుగుతుంది. గృహ వస్తు వాహన రిపేర్లు ఉండగలవు. ప్రభుత్వ సంబంధమగు పనులు నిదానంగా జరిగి విసుగు, టెన్షన్ కలిగిస్తాయి. శుభకార్యం నిర్ణయం కావచ్చును. ప్రభుత్వ ప్రోత్సాహకాలు లభించగలవు. ఉద్యోగులకు అధికారులకు పనిభారం పెరుగుతుంది.

### మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

సొంత పనులు అనుకున్న విధంగా జరగక టెన్షన్ పడతారు. ఉద్యోగార్థులకు అవకాశాలు కలసివస్తాయి. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. రావలసిన బాకీలు వసూలు కాగలవు. శుభకార్యాలు నిర్ణయం కావడం, దూర ప్రయాణాలుంటాయి. అధికారులకు, ఉద్యోగులకు అదనపు బాధ్యతలుంటాయి. ప్రభుత్వ ప్రోత్సాహకాలు పొందడం జరుగుతుంది. విద్యా ప్రగతి బాగుంటుంది.

# తప్పిపోయిన వెంకయ్యనాయుడు

శ్రీను గల్పిక

*జనవరి 12వ తేదీ... వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్... ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, తమిళనాడు గవర్నర్ పురోహిత్, మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పి.నారాయణ, కామినేని శ్రీనివాస్ తదితరులంతా సంక్రాంతి సంబరాలలో పాల్గొన్నారు. వెంకయ్యనాయుడు స్పెషల్‌గా చేయించిన అరిసెలు తిన్నారు. కార్యక్రమం ముగిసాక వెంకయ్యనాయుడు మైకు పట్టుకుని అందర్నీ ఉద్దేశించి నేను ఈరోజు నుండి 16వ తేదీ పొద్దున దాకా ఇక్కడే వుంటాను, అయితే ఎవరూ నన్ను కలవడానికి రావద్దు. మీరొచ్చినా నేను కనిపించను అని చెప్పాడు. ఆ మాటకు అందరూ ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు. ఆయన అలా ఎందుకన్నాడో అర్థం కాలేదు. సరేలే అంటూ ఎవరి దారిన వాళ్ళు పోయారు. వెంకయ్య కుటుంబ సభ్యులతో కలిసి ఆ రాత్రికి అక్కడే పడుకున్నారు.*

★★★★★

*13వ తేదీ తెల్లవారుజామున 4గంటలు... నాకు ఇదే చివరి కూత అన్నట్లు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో భోగి పండుగ కోసం తెచ్చిపెట్టిన కోడిపుంజు కూత పెట్టింది. ఆ కూతకు వెంకయ్య సతీమణి ఉషమ్మకు టక్కున మెలకువ వచ్చింది. కళ్లు తెరచి చూస్తే వెంకయ్య లేడు. ఒకవేళ లేచి బాత్రూంకు వెళ్లాడేమోనని పది నిముషాల పాటూ కళ్ళు తెరచి చూడసాగింది. బాత్‌రూంలో ఎలాంటి అలికిడి లేకపోవడంతో ఆమెకు అనుమానమొచ్చింది. ఆదుర్దాగా లేచి బయటకొచ్చింది. కాని ఎక్కడా ఆయన కనిపించలేదు. ఆందోళనతో హర్ష, దీపా వెంకట్‌లను లేపింది. అందరూ ఆందోళన చెందుతూ ట్రస్ట్ ప్రాంగణమంతా వెదుకుతూ బయటకొచ్చారు. అక్కడ గుడి వద్ద ఒక పిల్లాడు మాత్రం కనిపించాడు. ధనుర్మాసం కాబట్టి తెల్లారుజామునే పూజారులు గుడి తెరచి పూజలు చేస్తుంటారు. పూజారి పెట్టే ప్రసాదం కోసమే ఆ పిల్లాడు అరగంట నుండి అక్కడ నిలబడినట్లుగా వుంది. ఖాకీ నిక్కరు, లాగూ చొక్క వేసుకున్న ఆ పిల్లాడిని చూస్తే దీపావెంకట్‌కు ఎక్కడో చూసినట్లు అనిపించసాగింది. అయినా ఆ కుర్రాడి వద్దకు వెళ్ళి... బాబూ ఇటు వెంకయ్యనాయుడు తాత రావడం ఏమన్నా చూసావా అని అడిగింది. లేదమ్మా అని ఆ బాలుడు సమాధానమిచ్చాడు. దీపావెంకట్‌కు బాధేసింది. వెంకయ్య ఫ్రెండ్స్ అందరికీ ఫోన్‌లు చేసి నాన్నగారు మీ ఇంటికేమన్నా వచ్చారా అని అడిగింది. అందరి నుండి రాలేదని సమాధానం. ఈలోపు వెంకయ్య తప్పిపోయాడన్న వార్త దావానలంలా వ్యాపించింది. టీవీ ఛానెల్స్ 'కత్తి మహేష్ వర్సెస్ అజ్ఞానవాసి' సబ్జెక్ట్‌ను కూడా పక్కన పెట్టేసి 'తప్పిపోయిన ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు – దేశం మొత్తం ఆందోళన' అంటూ బ్రేకింగ్ న్యూస్‌లు ఇవ్వసాగాయి. వార్త తెలియగానే ప్రధాని నరేంద్ర మోడీ అత్యవసర కేబినెట్ సమావేశం పెట్టాడు. ఆయన ఎలా తప్పిపోయాడనే దానిపై సిబిఐ దర్యాప్తుకు ఆదేశించాడు. ఉపరాష్ట్రపతిని వెదకడానికి వైమానిక దళానికి చెందిన హెలికాప్టర్‌లను రంగంలోకి దించారు. నెల్లూరుజిల్లాలోని అన్ని మండలాలను జల్లెడపట్టడానికి ప్రత్యేక బలగాలను నెల్లూరుకు తరలించారు. వెంకయ్య తప్పిపోయాడనే సమాచారంతో మంత్రులు సోమిరెడ్డి, నారాయణ, కలెక్టర్ ముత్యాలరాజు, ఎస్పీ రామకృష్ణ, జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, బీజేపీ నాయకులందరూ ట్రస్ట్‌కు చేరుకున్నారు. సోమిరెడ్డి అయితే భయపడుతున్న ఉషమ్మ, దీపమ్మలను ఓదారుస్తూ.... భారతదేశంలో అణువణువు తెలిసిన నాయకుడమ్మా మా నాయుడు గారు. ఆయన తప్పిపోవడం పెద్ద జోక్. ఆయన కనిపించకుండా ఉండడం వెనుక ఏదో ట్విస్ట్ ఉంటుంది అని ధైర్యం చెప్పాడు.*

*వీళ్ళందరూ ఇక్కడ ఆందోళనలో ఉండగానే పొద్దున గుళ్ళో ప్రసాదం కోసం నిలబడి వున్న కుర్రాడు సైకిల్‌పై తాటాకుల మోపులు తెచ్చి ట్రస్ట్ ప్రాంగణం వద్ద పెట్టాడు. మళ్ళీ సైకిల్ తొక్కుకుంటూ వెళ్లాడు. కొద్దిసేపటికి ఇంకో తాటాకుల కట్ట తెచ్చాడు. ఇలా పది తాటాకుల కట్టలు అక్కడ పేర్చాడు. అందరూ ఆ కుర్రాడిని చూస్తున్నారేగాని, వెంకయ్య కనిపించలేదనే షాక్‌లో ఎవరూ సీరియస్‌గా పట్టించుకోలేదు. వీళ్ళు ఈ స్థితిలో ఉండగానే ఆ కుర్రాడు సైకిల్ టైరుతో కొద్దిసేపు ఆడుకున్నాడు. ఇంకో నలుగురు పిల్లలను తోడు తీసుకుని వచ్చి టెంకాయ మట్టమీద ఒకరు ఎక్కితే ఇద్దరు లాగే ఆటాడుకున్నారు. ఆ పిల్లలంతా చెట్లు ఎక్కి కొద్దిసేపు కోతికొమ్మచ్చి ఆడుకున్నారు. కొద్ది సేపు వంగులు దూకుళ్ళు, బిళ్లాకోడు ఆడుకున్నారు. వెంకయ్య కోసం ఎవరి వెదుకులాటలో వాళ్ళున్నారు. ఈ లోకంతో నాకేం సంబంధమన్నట్లు ఆ కుర్రాడు మాత్రం అక్కడ గురుకుల పాఠశాల విద్యార్థుల వసతి గృహంలోనే పడుకుని ఆ రాత్రికి నిద్రపోయాడు.*

*14వ తేదీ తెల్లారుజామున 3గంటలు. తలుపు తట్టిన శబ్దమొచ్చేసరికి తమ నాయన వచ్చాడేమోనని దీపావెంకట్ ఆత్రుతగా తలుపులు తీసింది. ఎదురుగా గుళ్లో చూసిన కుర్రాడు. ఏంటని అడిగింది. భోగి మంట వేసుకుందాం రామ్మా... అని ఆ పిల్లాడు పిలిచాడు. అందుకామె నాకు పండుగ చేసుకునే మూడ్ లేదు, మా నాయన వస్తేనే పండుగ చేసుకుంటాం అని చెప్పింది. దానికి ఆ పిల్లోడు ఆమె చేయి పట్టుకుని, మీ నాయన చిన్నపిల్లాడేం కాదు తప్పించుకుపోవడానికి, సాయంత్రానికల్లా వస్తాడులే రామ్మా అంటూ భోగి మంట వద్దకు తీసుకెళ్లాడు. ఉషమ్మ, హర్షలు కూడా లేచి భోగిమంట వద్దకు వచ్చారు. ఆ కుర్రాడు వరుసబెట్టి తాటాకులను మంటలో వేస్తున్నాడు. కరెంట్ స్థంభాల తీగలను తాకేలా మంట ఎగబాకింది. అక్కడున్న స్కూల్ పిల్లలు ఆ మంటలు చుట్టూ చేరి చలి కాచుకుంటూ కేరింతలు కొడుతున్నారు. భోగి మంటలు అయ్యాక ఆ పిల్లోడు దీపాతో... బజారుకుపోయి చికెన్ తెస్తాను, నాకు దోశ, చికెన్ చేసి పెట్టమ్మా అని అడిగాడు. పిల్లాడు కదా... నోరు తెరిచి అడిగాడు అని ఆమె కాదనలేకపోయింది. దీపమ్మ చేసి పెట్టిన చికెన్, దోశలు, వడలు లాగించాడు. ఆ తర్వాత అరిశెలు, లడ్లు, కారపప్పూస తిన్నాడు. ఆ తర్వాత బయటకొచ్చి ఇతర పిల్లకాయలతో కలిసి వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్ ఆడుకున్నాడు. గంగిరెద్దులను తీసుకొచ్చి ఆడించాడు. సైకిల్ తొక్కుకుంటూ కసుమూరు, చవటపాళెం వెళ్లొచ్చాడు. సాయంత్రంగా మళ్ళీ ట్రస్ట్ వద్దకు వచ్చి... అమ్మా, మన బాలయ్యబాబు సినిమా 'జై సింహా' సూపర్‌గా వుందంట... నెల్లూరుకు సినిమాకు పోదామమ్మా అని అడిగాడు. అందుకు దీపా... నాకు సినిమా చూసేంత ఆనందం లేదులే బాబూ అని చెప్పింది.*

*వెంకయ్య కోసం జరుగుతున్న సెర్చింగ్‌లో భాగంగా ప్రధాని మోడీ, ఇతర కేంద్ర మంత్రులు, హైటెక్‌రత్న, సీఎం చంద్రబాబు, రాష్ట్ర మంత్రులు అందరూ వచ్చారు. వెంకయ్య కనిపించకపోవడంతో అందరిలోనూ టెన్షన్. అప్పుడే కళ్లకు నల్లద్దాలు పెట్టి స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకా(66) అక్కడకు వచ్చాడు. మోడీ వుండి వివేకాతో... వెంకయ్య ఎక్కడకు వెళ్ళి వుంటాడు వివేకా అని అడిగాడు. దానికి వివేకా... ఆయన ఎక్కడకీ పోడు... ఇక్కడే వుంటాడు. ఆయనను ఎలా బయటకు రప్పించాలో నాకు తెలుసు. నేనేం చేసినా మీరు కామ్‌గా వుండండి అంటూ రెండు కిళ్లీలు నోట్లో వేసుకుని బాగా నమిలి అక్కడే క్లీన్‌గా వున్న గోడమీద ఉమ్మేసాడు. అంతే అది చూసిన దీపా వెంకట్‌ను సినిమాకు పోదామని బ్రతిమలాడుతున్న కుర్రాడు పరుగెత్తుకుంటూ... ఏయ్ వివేకా బుద్ధుందా... మన ప్రధాని నరేంద్ర మోడీ స్వచ్ఛభారత్ అని పదేపదే మొత్తుకుంటుంటే, నువ్విలా గోడలను ఖరాబ్ చేస్తావా... అంటూ మండిపడసాగాడు. అప్పుడు వివేకా నవ్వుతూ ఆ కుర్రాడి తల పట్టుకున్నాడు. అతని తల మీద వున్న విగ్గు ఊడి చేతికొచ్చింది. విగ్గు తీసి చూస్తే అతనే వెంకయ్యనాయుడు. అందరూ షాక్ తిన్నారు. ఎందుకిలా చేసారు నాన్నా అని దీప అడిగింది. సంక్రాంతి పండుగను చిన్నతనంలో ఎంజాయ్ చేసానమ్మా... మళ్ళీ అలాంటి ఆనందం కావాలనిపించింది. అందుకే ఈ పండుగరోజుల్లో ఎవర్నీ ఇక్కడికి రావద్దని చెప్పింది అని తన కోసం ఆదుర్దా చెందిన అందరికీ థ్యాంక్స్‌తో పాటు సారీ చెప్పాడు వెంకయ్య.*



# పరవశించిన పెన్నాతీరం



పెన్నాతీరంలో కొలువైన వివిధ దేవతామూర్తులు

సంక్రాంతి పండుగ ముగింపు వేడుకల్లో భాగంగా ఈ నెల 17వ తేదీ రాత్రి పెన్నాతీరం పరవశించింది. గొబ్బెమ్మ ఓల లాడింపు వేడుకకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. సంక్రాంతి సందర్భంగా గొబ్బి గౌరమ్మకు విశేషంగా పూజలు నిర్వహించి పెన్నా నదిలో నిమజ్జనం చేసేందుకు విచ్చేసిన భక్తులతో పెన్నాతీరం కిటకిటలాడింది. వేడుక అనంతరం భక్తులు కుటుంబ సమేతంగా పెన్నాతీరంలో ఆహ్లాదకర వాతావరణంలో గాలిపటాలను ఎగుర వేస్తూ సందడి చేశారు. విద్యుద్దీప కాంతుల నడుమ పెన్నాతీరం నూతన శోభతో కళకళలాడింది. రంగనాయకులపేట నుంచి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాథుడు, జొన్నవాడ కామాక్షమ్మ, దర్గామిట్ట శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారు, నర్రవాడ వెంగమాంబ, నరశింహకొండ నుంచి నరశింహస్వామి, గ్రామ దేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారు, మూలాపేట దేవస్థానం నుంచి ప్రత్యేకంగా భారీ శివలింగాన్ని ప్రత్యేక వేదికపై కొలువు తీర్చి విశేషంగా అలంకారం నిర్వహించారు. జిల్లాలోని ప్రముఖ ఆలయాల నుంచి విచ్చేసిన దేవతామూర్తులను భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. తొలుత ఈ వేడుకలను రాష్ట్రమంత్రి పొంగూరు నారాయణ బెలూన్లను ఎగురవేసి పండుగ కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథులతో కలసి పెన్నాతీరంలో ఆహ్లాదంగా గాలిపటాలను ఎగురవేశారు. పిల్లలకు ఉచితంగా గాలిపటాలను పంపిణీ చేశారు. ప్రత్యేకవేదికల వద్ద కొలువుతీరిన దేవతామూర్తులను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తాళ్ళపాక అనూరాధ, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటి ఛైర్మెన్ చాట్ల నరశింహారావు, నగర కమిషనర్ అలీంబాషా, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ వేగూరు రవీంద్రరెడ్డి, దేవస్థానాల కార్యనిర్వహణాధికారులు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# సంకల్పయాత్రకు సర్వ సన్నద్ధం

జిల్లాలో 23వ తేదీ నుండి మొదలయ్యే వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప పాదయాత్రకి పార్టీ శ్రేణులు సర్వ సన్నద్ధంగా వున్నాయని వైసిపి జిల్లా పరిశీలకుడు సజ్జల రామకృష్ణారెడ్డి, నెల్లూరు ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే, వైసిపి నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిలు వెల్లడించారు. ఈనెల 17వ తేదీన నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు జగన్ పాదయాత్ర వివరాలను చెప్పారు.



పాదయాత్ర వివరాలను వెల్లడిస్తున్న సజ్జల రామకృష్ణారెడ్డి, వైసిపి నాయకులు

ఈ నెల 23వ తేదీన పెళ్ళకూరు మండలంలోని పెనబాక గ్రామం వద్ద జిల్లాలో జగన్ పాదయాత్ర మొదలవుతుంది. ఆరోజు ఉదయం 9గంటలకు పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, నాయకులు, సమన్వయకర్తలు జగన్‌కు స్వాగతం పలుకుతారు. అక్కడనుండి పాదయాత్ర సూళ్లూరుపేట, వెంకటగిరి, గూడూరు, సర్వేపల్లి, నెల్లూరురూరల్, ఆత్మకూరు, కావలి నియోజకవర్గాల మీదుగా కొన సాగుతుందని, జిల్లాలో దాదాపు 20 రోజుల పాటు ఈ పాదయాత్ర జరుగుతుందని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పి.అనిల్‌కుమార్‌యాదవ్, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మాజీమంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, వైసిపి నాయకులు మేరిగ మురళి, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, పి.రూప్ కుమార్‌యాదవ్, హంజాహుస్సేన్, భాస్కర్ గౌడ్, ఎన్.శ్రీనివాసులురెడ్డి, కె.వెంకటేశ్వర్లు, జి.పి.శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కాలధర్మం

### కెమిస్ట్రీ లెక్చరర్ పట్టయ్య



నెల్లూరులోని వి.ఆర్.కళాశాల రిటైర్డ్ కెమిస్ట్రీ లెక్చరర్ మందపాటి పట్టాభిరామిరెడ్డి ఈ నెల 16వ తేదీన కన్ను మూశారు. ఆయన వయసు 86 సంవత్సరాలు. ఆయనకు ఇద్దరు కుమార్తెలున్నారు. తడ మండలం చేనిగుంట ఆయన స్వగ్రామం. విఆర్ కళాశాలలో కెమిస్ట్రీ అధ్యాపకుడిగా ఎన్నో వేలమంది విద్యార్థుల ఉన్నతికి బాటలువేశారు. కమ్యూనిష్టు పార్టీ సానుభూతిపరుడుగా ఉండేవారు. 'లాయర్' పత్రిక వ్యవస్థాపకులు కీర్తిశేషులు తుంగా రాజగోపాల్‌రెడ్డితో పాటు ఆయన సోదరుడు వి.ఆర్. కాలేజీ మేనేజర్‌గా అందరికీ సుపరిచితుడు కీర్తిశేషులు తుంగా వెంకటరమణారెడ్డితో కూడా పట్టాభిరామిరెడ్డికి మంచి స్నేహ బాంధవ్యాలుండేవి. ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

### మల్లి హేర్‌స్టైల్స్ 'మల్లి'



నెల్లూరులో ఎంతటి విఐపికైనా హేర్ స్టైల్ అంటే గుర్తొచ్చే పేరు మల్లి. హేర్ కటింగ్‌లో సిద్ధహస్తుడు. అతని చేయి పడనిదే చాలామందికి క్రాఫ్ చేయించుకున్నామన్న ఫీలింగ్ ఉండదు. ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులైతే ఇతర ప్రాంతాలకు వెళ్ళినా క్రాఫ్ చేయించుకోవడానికి మల్లినే తాముంటున్న ప్రాంతాలకు పిలిపించుకున్న సందర్భాలెన్నో! సామాన్యుడి నుండి ఎంతోమంది ఐఏఎస్, ఐపిఎస్ అధికారులతో పాటు భారత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు వరకు ఎంతోమంది గ్లామర్‌ను తీర్చిదిద్దింది మల్లినే! అలాంటి దూబాకుల మల్లిఖార్జున ఇక మన మధ్య లేడు. గత కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న మల్లి చిన్నవయస్సులోనే ఈ నెల 14వ తేదీన తుదిశ్వాస విడిచాడు. ఆయన వయసు 47సంవత్సరాలు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.



ఈ నెల 18న మాజీముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారకరామారావు వర్ధంతి సందర్భంగా విజయవాడలోని ఎన్టీఆర్ సహకార భవనం నందు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నెల్లూరుజిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, ఆప్కాబ్ ఛైర్మెన్ పిన్నమనేని వెంకటేశ్వరరావు



# స్విస్‌లో తెలుగోళ్ళ సంక్రాంతి సంబరాలు

ఏ రాష్ట్రంలో వున్నా ఏ దేశంలో వున్నా తెలుగోళ్ళు తెలుగోళ్ళే! తెలుగు పండుగలు తెలుగు పండుగలే! ఒక్క సంవత్సరం మన పండుగను జరుపుకోకపోయినా ఏదో వెలితి. అందుకే విదేశాలలో వున్నోళ్ళు కూడా తమ పండుగలను సాంప్రదాయబద్ధంగా జరుపుకుంటున్నారు. స్విట్జర్లాండ్‌లో వుంటున్న తెలుగోళ్ళు ఈ నెల 14వ తేదీన బాసెల్ నగరంలో సంక్రాంతి సంబరాలను సాంప్రదాయబద్ధంగా ఘనంగా జరుపుకున్నారు. తెలుగు వారంతా సాంప్రదాయ దుస్తులతో హాజరయ్యారు. భోగి మంటలు వేసి పిల్లలకు భోగి పండ్లు పోశారు. చిన్నారులచే సాంప్రదాయ నృత్యాలు ప్రదర్శించారు. మహిళలు ఆటపాటలతో గడిపారు. ఈ సందర్భంగా స్విట్జర్లాండ్‌లోని తెలుగు ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ ఏపి వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్, సంగీత దర్శకుడు కోటి, గాయకులు సింహా, గీతామాధురి పంపిన వీడియో సందేశాలను స్క్రీన్‌పై ప్రదర్శించారు. దామాయి శ్రీనివాస్, కరణం గణేష్, మధుసూదన్, హర బొబ్బిలిల పర్యవేక్షణలో ఈ సంక్రాంతి సంబరాలు ఆనందోత్సాహాలతో జరిగాయి.



# సింహపురిలో విజయవంతంగా 'సేఫ్ స్పైన్ సర్జరీ'



విలేకర్లతో మాట్లాడుతున్న డాక్టర్ టి.గోపాలకృష్ణయ్య

నెల్లూరు సింహపురి హాస్పిటల్‌లో మొట్టమొదటిసారిగా న్యూరోమానిటరింగ్ ద్వారా 'సేఫ్ స్పైన్ సర్జరీ'ని విజయవంతంగా నిర్వహించారు. ఈ నెల 14న హాస్పిటల్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో చీఫ్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ టి.గోపాలకృష్ణయ్య మాట్లాడుతూ కడపజిల్లా పులివెందులకు చెందిన రాజేశ్వరరెడ్డి, రాజేశ్వరి దంపతుల కుమార్తె లలిత(12)కు వెన్నుపూస 110 డిగ్రీలు వంగిపోయిన స్థితిలో హాస్పిటల్‌కు తీసుకువచ్చారని తెలిపారు. లలిత వెన్నుపూసకు న్యూరోమానిటరింగ్ ద్వారా సేఫ్‌స్పైన్ సర్జరీని విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఇటువంటి సర్జరీ చేసే సమయంలో కాళ్ళు చచ్చుబడిపోవడం, మల, మూత్ర విసర్జన చేయలేకపోవడం తదితర సమస్యలు తలెత్తుతాయన్నారు. ఈ సమస్యలను నివారించేందుకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఇంట్రా ఆపరేటివ్ న్యూరో మానిటరింగ్ ద్వారా ప్రప్రథమంగా తమ హాస్పిటల్‌లో ఆపరేషన్ చేయడం జరిగిందన్నారు. ఈ టెక్నాలజీతో పాపకు 110 డిగ్రీలు వంకరగా వున్న వెన్నుపూసను 85శాతం సాధారణ స్థితికి తీసుకురావడం జరిగిందన్నారు. ఈ శస్త్ర చికిత్సకు సహకరించిన మత్తు వైద్య నిపుణుడు డాక్టర్ రంగనాథ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో లలిత తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# విహారంలో విషాదం

## - కోడూరు బీచ్‌లో ముగ్గురు మృతి

సరదాగా విహారానికి వస్తే, మృత్యువు ఆ ముగ్గురినీ పొట్టన పెట్టుకుంది. కన్నవారికి కడుపుకోతను మిగిల్చింది. మృతుల్లో ఇద్దరు అన్నదమ్ములున్నారు. ఒకే కుటుంబానికి చెందిన ఆ ఇద్దరూ సముద్రపు కెరటాలకు బలికావడంతో వారి తల్లిదండ్రులు కంటికి మింటికి ఏకధాటిగా రోదిస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. మనుబోలు మండలంలోని కొమ్మలపూడికి చెందిన యువకులు పెనుబల్లి యశ్వంత్(26), పెనుబల్లి దిలీప్(24), బిడిశపు వెంక టేశ్వర్లు(22) ఈనెల 17వతేది ఉదయం సరదాగా తోటపల్లి గూడూరు మండలంలోని కోడూరు బీచ్‌కు విహారానికి వెళ్లారు. యశ్వంత్, దిలీప్‌లు అన్నదమ్ములు. ఇటీవలే క్రికెట్ టోర్నమెంట్‌లో గెలిచామనే సంబరంతో ఉన్న ఆ యువకులు కోడూరు బీచ్‌లో ఈతకు దిగారు. అయితే, అలల ధాటికి తట్టుకోలేక ఎవరికివారు కకావికలమై గల్లంతయ్యారు. వీరితోపాటు సముద్రంలోకి దిగిన మరో యువకుడు విష్ణువర్ధన్‌రెడ్డి కూడా అలల్లో కొట్టుకుపోతుం డగా, అక్కడే ఉన్న కృష్ణపట్నం పోర్ట్ మెరైన్ హోంగార్డ్ సంజీవ్ వెంటనే సముద్రంలోకి దూకి అతని ప్రాణాలు కాపాడాడు. గల్లం తైన కొమ్మలపూడికి చెందిన ముగ్గురు యువకుల మృతదేహాలు మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో తీరానికి కొట్టుకువచ్చాయి.



మృతదేహాలను నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. యశ్వంత్ బిటెక్ పూర్తిచేసి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉంటే, చిన్న వాడైన దిలీప్ ఎంబిఏ పూర్తిచేశాడని, తమ కుమారులు చేతికి అందివచ్చే తరుణంలో మృత్యువు వారిని కాటేసిందంటూ ఆ తల్లిదండ్రులు పెద్దపెట్టున రోదించారు. వెంకటేశ్వర్లు ఆదిశంకర కళాశాలలో బిటెక్ మూడవ సంవత్సరం చదువుతున్నాడు. వీరిది చాలా పేద కుటుంబం. తండ్రి ఎప్పుడో ఇల్లు వదిలేసి వెళ్లిపోతే, తల్లి గొర్రెలు మేపుకుంటూ కుమారుడిని కష్టపడి చదివి స్తోంది. ఈ దశలో వెంకటేశ్వర్లు మృతి చెందడంతో ఆ తల్లి శోకంతో తల్లడిల్లి పోతోంది. ఇదిలావుంటే, మరో ఘటనలో ఇదే రోజున అనుమసముద్రంపేట మండ లంలోని జువ్వలగుంటపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు (23)అనే యువకుడు కూడా స్నేహితులతో కలసి సరదాగా ఈత కొట్టడానికి ఆ గ్రామ సమీపంలో ఉన్న నీటిగుంటలోకి దూకాడు. అయితే, ముని గినవాడు మళ్లీ పైకి రాలేదు. స్నేహితుల సమాచారంతో ఎస్ఐ వీరప్రతాప్ ఘటనా స్థలిని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వెంకటేశ్వర్లు మృతితో తండ్రి వెంకటరత్నం బాధ వర్ణనాతీతం.

ఇలా ఒకే రోజున జిల్లాలో నలుగురు యువకులు మృతిచెందడం ఎంతైనా బాధాకరం.

# దుగరాజపట్నం పోర్ట్‌ను ఏర్పాటు చేయాలి

## - బిజెపి నాయకుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి

జిల్లాకు చెందిన దుగరాజపట్నంలో పోర్ట్ ఏర్పాటు చేయాలని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి అన్నారు. ఈ నెల 12న ఆయన నెల్లూరులోని బిజెపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, దుగరాజపట్నం పోర్ట్‌కు కేంద్రప్రభుత్వ అనుమతులను, పోర్ట్ అథారిటీ చేసిన సర్వేలు, గతంలోని యూపిఏ ప్రభుత్వం విభజన చట్టంలో పేర్కొన్న అంశాలను ఆయన ఈ సందర్భంగా వివరించారు. దుగరాజపట్నం పోర్ట్ జిల్లా ప్రజల హక్కు అని ఆయన అంటూ, దానిని సాధించుకోవా లన్నారు. దుగరాజపట్నం పోర్ట్ ఏర్పాటుతో జిల్లా మరెంతో అభివృద్ధి చెందుతుందని, సుమారు 30వేల కోట్ల దాకా పెట్టుబడులు వస్తాయని, జిల్లాలో నిరుద్యోగసమస్య కొంతమేరకైనా తగ్గుతుందని అన్నారు. జిల్లాకు చెందిన ఇద్దరు రాష్ట్ర మంత్రులు, అధికారపార్టీ వారు ఈ పోర్ట్ ఏర్పాటుకు కృషి చేసి జన్మభూమి రుణం తీర్చుకోవాలన్నారు. ఈ సమావేశంలో బిజెపి నాయకులు మిడతల రమేష్, ఎం.భాస్కర్, అన్నం శ్రీనివాసులు, కోసూరు బాలయ్యగౌడ్, నీలిశెట్టి కోటేశ్వరరావు, కరణం భాస్కర్, వినాయకరావు, సాయి శ్రీనివాస్, షఫిఉల్లా, ఆవుల నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# బహుమతుల ప్రదానం

సంక్రాంతి పండుగల సందర్భంగా కొత్తూరు పరిధిలోని చంద్రబాబునగర్‌లో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు ఈ నెల 16న విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి బహుమతులను ప్రదానం చేశారు. 31వ డివిజన్ కార్పొ రేటర్ తురకా అనిత, సూరిబాబు, శ్రీధర్ రెడ్డి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో...

సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 17న కొత్తూరు అరుంధతీయ వాడలో ముగ్గులపోటీలు నిర్వహించారు. విజేతలకు కార్పొరేటర్ అనిత బహుమ తులందజేశారు. సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ నాయకుడు పల్లాల శ్రీనివాసులు, సునీత, ఎం.సురేష్‌బాబు, సుమన్ పాల్గొన్నారు.

# గుర్రాల రమణయ్యకు సన్మానం



నెల్లూరుకు చెందిన ప్రముఖ కవి గుర్రాల రమణయ్యకు హైదరాబాద్ లోని త్యాగ రాయ గానసభలో ఇటీవల ఘనసన్మానం చేశారు. ప్రముఖ సాహితీవేత్త గుదిబండ వెంకటరెడ్డి (జివిఆర్) జాతీయస్థాయి కవితల పోటీ-2018లో విజేతగా బహు మతి పొందిన గుర్రాల రమణయ్యను ఈ సందర్భంగా ఆ సంస్థ ప్రతినిధులు, ప్రముఖులు ఓలేటి పార్వతీశం తదితరులు ఘనంగా సన్మానించారు.

# రంగనాథస్వామికి బంగారు గరుడసేవ



తై అమావాస్య సందర్భంగా రంగనాయ కులపేటలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాథస్వామివారికి బుధవారం రాత్రి వైభవంగా బంగారు గరుడసేవ నిర్వహించారు. స్వామివార్లను ఎంతో శోభాయమానంగా అలం కరించి, విశేష పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తజనం బంగారు గరుడసేవలో దర్శనమిస్తున్న స్వామివార్లను తిలకించి పులకించిపోయారు. ఆలయ ఛైర్మెన్ మంచికంటి సుధాకరరావు, కార్యనిర్వహ ణాధికారి కోవూరు జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి.

# కిటకిటలాడుతున్న పక్షుల కేంద్రం

నెల్లూరుజిల్లా దొరవారిసత్రం మండలం నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం సందర్శకులతో కిటకిటలాడుతోంది. సంక్రాంతి సందర్భంగా పాఠశాలలకు సెలవులు కావడంతో వివిధ ప్రాంతాల్లోని సందర్శకులు కుటుంబసభ్యులతో కలసి నేలపట్టుకు వచ్చి విదేశీ విహంగాలను తిలకించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకు రోజుకు దాదాపు వెయ్యిమంది పర్యాటకులు కేంద్రంకి వచ్చినట్లు వన్యప్రాణి విభాగం అధికారులు తెలిపారు. 14, 15తేదీల్లో చెన్నై, తిరుపతి, విజయవాడ, బెంగుళూరు, తెలంగాణ, ఒంగోలు ప్రాంతాల నుంచి సందర్శకులు వచ్చారు. దీంతో పక్షుల కేంద్రంలో పక్షుల పండుగ వాతావరణం నెలకొంది. పర్యావరణం కేంద్రం వద్ద పిల్లల పార్కులో చిన్నారులు ఆటపాటల్లో మునిగితేలారు.

# వికటించనున్న కులం కార్డు

(మొదటి పేజీ తరువాయి)

బ్రాహ్మణులను పూర్తిగా తన వైపుకు లాక్కున్నాడు. ఎస్సీ వర్గీకరణ హామీ, రజకులను ఎస్టీల్లో చేర్చడం, మత్స్యకారులను ఎస్సీలలో చేర్చడం వంటి హామీలతో వారి ఓట్లను రాబట్టారు. ఆ ఎన్నికల వరకు చంద్రబాబుకు కులం కార్డు బాగానే ఉపయోగపడింది.

ఇదే కులం కార్డు రేపటి ఎన్నికల్లో ఆయనకు రివర్స్ అవుతుందా? కాపులకు 5శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయించి కేంద్రప్రభుత్వానికి పంపారు బాగానే వుంది... కేంద్రం దీనిని ఆమోదించే పరిస్థితి లేదు. ఎందుకంటే గుజరాత్ ఎన్నికలను పెట్టుకుని రాజకీయంగా నష్టం జరుగుతుందని తెలిసి కూడా మోడీ పటేళ్ళ రిజర్వేషన్‌కు అంగీకరించలేదు. కాబట్టి కాపు రిజర్వేషన్ల తీర్మానాన్ని కేంద్రం ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించదు. కేంద్రం అంగీకరించకపోతే తప్పును బీజేపీ మీదకు తోసేయొచ్చని చంద్రబాబు భావిస్తుండొచ్చు. కాపులు అమాయకులైతే ఆ విధంగా జరగొచ్చు. కాని ఎన్నికలలోపు వాళ్ళకు అధికారికంగా రిజర్వేషన్‌లు రాకపోతే ప్రభుత్వంపై తిరగబడే అవకాశముంది.

కాపులకు రిజర్వేషన్‌లు వస్తాయో లేదో గాని ఈ అంశం మూలంగా ఇప్పటివరకు తెలుగుదేశంకు గట్టి ఓటు బ్యాంకుగా వున్న బీసీలలో మాత్రం చీలిక వచ్చింది. కాపు రిజర్వేషన్‌లను వ్యతిరేకిస్తూ ఇటీవల వాళ్ళు తెలుగుదేశం ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించడం చూసాం. ప్రతి ఎన్నికల్లోనూ తెలుగుదేశంకు నికరంగా పడే ప్రతి వంద బి.సి ఓట్లలో 10ఓట్లు చీలినా, అది పార్టీకి ఎంతో నష్టం చేయగలదు. కాపు రిజర్వేషన్ల మూలంగా కొద్ది శాతంలో అయినా తెలుగుదేశం బీసీల ఓట్లను కోల్పోతుందన్నది వాస్తవం.

ఇక మత్స్యకారులలోనూ ఇప్పటివరకు తెలుగుదేశంకు గట్టి పట్టుంది. తమను ఎస్సీలలో చేర్చాలంటూ వాళ్ళు ఆందోళన బాట పట్టారు. అది ఇప్పట్లో సాధ్యమయ్యేది కాదు. ఇక రజకులను ఎస్టీల్లో చేర్చడం కూడా సాధ్యం కాని పనే!

గత ఎన్నికల్లో టీడీపీకి సంపూర్ణ మద్దతు పలికిన వైశ్యులు, బ్రాహ్మణులు కూడా ఈసారి ఆ పార్టీ వైపు పూర్తిగా నిలిచే అవకాశాలు లేవు. వ్యాపారులపై కొనసాగుతున్న వేధింపులతో వైశ్యులు కొంత దూరమయ్యారు. రాష్ట్రంలో పలు చోట్ల దేవాలయాలు కూల్చడం, హిందూ వ్యతిరేక ధోరణుల వంటివాటి మూలంగా ప్రభుత్వంపై బ్రాహ్మణుల లోనూ అసంతృప్తి వుంది. ఈ కులాలన్నింటిలో వచ్చిన అసమ్మతి ఓట్ల రూపంలోకి మళ్ళితే చంద్రబాబుకు తీరని నష్టమే!

# సీట్ల కోసం పాట్లు

(మొదటి పేజీ తరువాయి)

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు చాలాకాలం తర్వాత ప్రధాని నరేంద్రమోడీ అపాయింట్‌మెంట్ దొరి కింది. అమరావతి రాజధాని శంకుస్థాప నకు మోడీ వచ్చి పోవడం తెలిసిందే! అప్పుడు ఆయన ఇక్కడేదో మనకు దొరక దన్నట్లు మట్టి, చెంబుడు నీళ్ళు తెచ్చి చంద్రబాబు ముఖాన కొట్టి వెళ్ళాడు. ఏపికి ఎటువంటి ప్రయోజనాలను ఆయన చేకూర్చలేదు. ఆ తర్వాత ప్రధానిని కలవ డానికి చంద్రబాబు ఎన్నోసార్లు ప్రయత్నిం చాడు. కాని ప్రధాని అపాయింట్‌మెంట్ దొరకలేదు. ఈలోపు వైసిపి రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి రెండుసార్లు ప్రధానిని కలిసారు. ఒక్క విజయసాయిరెడ్డే కాదు, ఏ రాష్ట్ర సీఎంకైనా, చిన్నా చితకా నాయకులకైనా పీఎం అపాయింట్‌మెంట్ దొరికింది. కాని చంద్రబాబుకు మోడీ అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడమే చిన్నతనంగా భావించారు. దీంతో చంద్ర బాబు అంటే మోడీకి పడదనే సంకేతాలు ప్రజల్లోకి వెళ్ళసాగాయి.

ఈ దశలో తెలుగుదేశం ఎంపీలు జోక్యం చేసుకుని పిఎంపై ఒత్తిడి తేవ డంతో ఇటీవల ఎట్టకేలకు ప్రధాని మోడీని చంద్రబాబు కలవగలిగాడు.

దొరక్కదొరక్క ప్రధాని అపాయింట్ మెంట్ దొరికింది. దీనిని రాష్ట్ర ప్రయోజ నాలకు అనుగుణంగా మలచుకోవాలి. విభజన చట్టంలో ప్రత్యేకహోదా వుంది. ఎన్డీఏ ప్రభుత్వం వచ్చాక ప్రత్యేకహోదాపై చేతులెత్తేసి ప్రత్యేక ప్యాకేజీతో సరిపెట్టారు. ఆ ప్యాకేజీ అన్నా సరిగా ఇస్తున్నారా అంటే అదీ లేదు. కేంద్రం బాధ్యతగా వున్న పోలవరం ప్రాజెక్టుకు ఎన్నో అవాంతరా లొస్తున్నాయి. రెవెన్యూ లోటును భర్తీ చేస్తామన్నారు. అదీ చేయడం లేదు. వచ్చే నెలలో బడ్జెట్ వుంటుంది. విశాఖ రైల్వే జోన్‌పై ఇంతవరకు ఎలాంటి ప్రక్రియ మొదలు కాలేదు. పారిశ్రామిక అభివృద్ధి పరంగా ఏపికి కేంద్రం నుండి ఎలాంటి చేయూతలేదు. విశాఖ-చెన్నై, బెంగుళూరు వయా కృష్ణపట్నంపోర్టు చెన్నై కారిడార్‌లు కేంద్రం బాధ్యత. వీటిపై ఇంతవరకు ఒక్క అడుగూ ముందుకు పడలేదు. దుగరాజ పట్నం పోర్టు హామీ అలాగే వుంది. ఇలా రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన ఎన్నో అంశాలను కేంద్రం నుండి సాధించు కోవాల్సిన అవసరముంది. చంద్రబాబు వాటన్నింటిని పక్కనపెట్టి రాష్ట్రంలో అసెంబ్లీ సీట్లను పెంచమనే ప్రధానిని ప్రధానంగా కోరినట్లు తెలుస్తోంది. అంటే ఇక్కడ చంద్రబాబు రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలకే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చాడు.

రాష్ట్రంలో అసెంబ్లీ సీట్లు పెరిగినంత మాత్రాన అనవసరపు అదనపు ఖర్చు పెర గడం తప్పితే ప్రజలకు దీని మూలంగా ఎలాంటి ఉపయోగం లేదు. అసెంబ్లీ సీట్లు పెంచాలని ప్రజలు కోరుకోవడం లేదు. కేవలం చంద్రబాబు మాత్రమే కోరుకుంటు న్నాడు. ప్రస్తుతం 175 సీట్లుండగా వాటిని 225కు పెంచాలంటున్నారు. సీట్లు పెంచితే వైసిపి నుండి తీసుకున్న 23మంది ఎమ్మెల్యేలకు సీట్లు అడ్జస్ట్ చేయడమే కాకుండా, అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఇంకా కొంత మంది వైసిపి నాయకులను పార్టీలోకి లాగాలనేది ఆయన ప్లాన్. బలమైన నాయకులందరినీ టీడీపీలో చేర్చుకుని సీట్లు ఇచ్చేయవచ్చు. అప్పుడు సీట్లు పెరిగితే వైకాపాకు చాలా చోట్ల గట్టి అభ్యర్థులు దొరకని పరిస్థితి ఏర్పడుతుంది. అభ్యర్థుల బలం మీద ఎక్కువ సీట్లు గెలవ వచ్చని చంద్రబాబు నమ్మకం.

సీట్లు పెరిగితే ఇక తనకు తిరుగుండ దని చంద్రబాబు భావిస్తున్నారు. అందు కోసమే బలంగా ప్రయత్నిస్తున్నాడు. మరి ప్రధాని మోడీ ఎంతవరకు ఆయనకు సహకరిస్తాడన్నది చూడాలి!

# ఆనందోత్సాహాలతో పెద్దపండుగ జరుపుకున్న వెంకయ్య



భారత ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడు కుటుంబసభ్యులతో కలిసి సంక్రాంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. 11వ తేదీనే నెల్లూరుకు చేరుకున్న వెంకయ్య నాయుడు ఆరోజు నుండి 16వ తేదీ పొద్దున తిరిగి వెళ్లే వరకు వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లోనే గడిపారు. 12వ తేదీ స్వర్ణభారత్ ట్రస్ట్‌లో జరిగిన సంక్రాంతి సంబరాలలో పాల్గొన్న ఆయన మన సంస్కృతి, మన పండుగలను గూర్చి వివరించారు. సంక్రాంతి పండుగ విశిష్టతను గురించి చెప్పారు. ఎవరు ఎక్కడ వున్నా, ఎంతటి ఉన్నత స్థానాలలో వున్నా సంక్రాంతి పండుగకు మాత్రం తమ సొంత గ్రామాలకు కదలివస్తారని, మన సంస్కృతి సంప్రదాయాలు, మన పండుగలలో వున్న గొప్పదనం మనుషులనే కాదు, మనసులను కూడా కలపగలవని చెప్పుకొచ్చారు.

14వ తేదీ తెల్లవారుజామున లేచి ట్రస్ట్ ప్రాంగణంలోనే ఆయన తన సతీమణి ఉషమ్మ, కూతురు దీప ఇతర కుటుంబసభ్యులతో కలిసి భోగి మంట వేసుకున్నారు. తన కోసం వచ్చిన ప్రముఖులను ప్రజలను కలుసుకున్నారు. సాంప్రదాయ దుస్తులు ధరించి ఆయన ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పిల్లలతో కలిసి గాలిపటాలు ఎగురవేసారు. 15వ తేదీ సంక్రాంతి సందర్భంగా పూజలు నిర్వహించారు. 16వ తేదీ కనుమ పండుగరోజు సతీమణి ఉషమ్మతో కలిసి గోపూజ నిర్వహించారు. ఈ ఏడాది పండుగకు ఆయన ఇక్కడే ఐదురోజుల పాటు ఉండడం, మన పండుగలపై ఆయనకున్న శ్రద్ధకు ప్రతీకగా చెప్పుకోవచ్చు.



గోపూజ నిర్వహిస్తున్న వెంకయ్య, ఉషమ్మ, దీపా వెంకట్

# చరిత్రగా కోటంరెడ్డి పాదయాత్ర

## సామాన్యుడే నాయకుడై... ప్రజాసేవకుడై...

*105 రోజులు...*
*15 వారాలు...*
*4,375గంటలు...*
*7,29,166 నిమిషాలు...*

*ఒక నాయకుడు తన ఇంటి ముఖం చూడకుండా తన ప్రజల మధ్యే వుంటూ తన ప్రజల కష్టసుఖాలు తెలుసుకుంటూ గడిపిన కాలం. గట్టిగా నాలుగు గంటలు ప్రజల మధ్య తిరిగితేనే విసుగొచ్చే నాయకులున్న నేటి కాలంలో ఒక నాయకుడు ఇన్ని రోజులు ప్రజల మధ్య గడపడాన్ని తన అదృష్టంగా భావిస్తున్నాడు. ఆ నాయకుడే నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి. ప్రజానాయకులు కావాలంటే రాజకీయ కుటుంబాల నుండి రానవసరంలేదని, రాజకీయ చరిత్ర వుండాల్సిన అవసరం లేదని, తాతలు తండ్రుల రాజకీయ వారసత్వం అవసరం లేదని నేటి కాలంలో చాటిచెప్పిన నాయకుడు.*

ఇప్పటి రాజకీయాలు ఎలా వున్నాయో చూస్తున్నాం. కోట్లన్నా ఖర్చు పెట్టగలిగి వుండాలి, లేక రాజకీయ కుటుంబ నేపథ్యమన్నా కలిగి వుండాలి. ఈ రెండూ కలిసి వుంటే ఇంకా అదనపు అర్హతన్నమాట. సామాన్యులకు రాజకీయాలు అందని ద్రాక్ష పండ్లు అనే సామెతకొచ్చిన కాలమిది. సామాన్య కుటుంబాల నుండి వచ్చే నాయకులు కనుమరుగై కాంట్రాక్టర్లు, కోటీశ్వరులు, పారిశ్రామికవేత్తలు రాజకీయాలను శాసిస్తున్నారు.

ఇలాంటి కాలంలోనూ సామాన్యుడు పట్టుబడితే రాజకీయాలను శాసించవచ్చని చాటిన సామాన్యుడు. విద్యార్థి దశ నుండి రాజకీయాలపై ఆసక్తి వున్న కోటంరెడ్డి తన రాజకీయ ప్రస్థానానికి డబ్బును, రాజకీయ నేపథ్యాన్ని నమ్ముకోలేదు. కేవలం శ్రమను నమ్ముకున్నాడు. శ్రమిస్తే ప్రజలు ఆదరిస్తారని నమ్మాడు. ఆ నమ్మకమే అతనిని ముందుకు నడిపింది. ఇప్పుడు నెలల తరబడి ప్రజల మధ్యన నడిపిస్తోంది.



2014 ఎన్నికలకు ముందు నెల్లూరు గ్రామీణ నియోజకవర్గంలో అలుపన్నది లేకుండా 141రోజులు ప్రజాబాట నిర్వహించి అప్పుడే సంచలనం సృష్టించాడు శ్రీధర్‌రెడ్డి. 2014 ఎన్నికల్లో నెల్లూరు రూరల్ నుండి వైసిపి అభ్యర్థిగా పోటీ చేసి దాదాపు 27వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించి సామాన్యుడి సత్తా చాటాడు. ఎమ్మెల్యేగా ఎన్నికయ్యింది మొదలు ఈరోజు దాకా ప్రతిరోజూ ప్రజలమధ్యే వుంటూ ప్రజల కోసమే పనిచేస్తున్నారు. ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి ప్రత్యేకంగా 105రోజుల పాదయాత్రను విజయదశమి రోజున ప్రారంభించి ఈనెల 12వ తేదీన విజయవంతంగా పూర్తిచేశారు. ఈ 105రోజులలో ఆయన కొన్ని వేల గడపలను తొక్కారు. కొన్ని లక్షలమంది హృదయాలను తట్టారు. వారింటిలో ఒక సభ్యుడిగా కలిసిపోయాడు. సామాన్యుడు ఎమ్మెల్యే అయితే ఇలా వుంటాడు... అని నిరూపించాడు. ఈ నెల 12వ తేదీన ప్రజాబాట ముగింపు కార్యక్రమాన్ని ముత్యాలపాళెం సెంటర్‌లో నిర్వహించగా, నెల్లూరురూరల్‌లోని అన్ని గ్రామాలు, అన్ని డివిజన్‌ల నుండి తండోప తండాలుగా తరలివచ్చిన ప్రజలే ఒక సామాన్యుడి నాయకత్వం పట్ల పెరిగిన విశ్వాసానికి నిదర్శనం.



ఇటీవల వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో భారత ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడును కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతున్న నెల్లూరులోని గౌరీశంకర్ ఫ్లవర్ డెకరేటర్స్ అధినేత పూల శీనయ్య

# వాడవాడలా ఎన్టీఆర్‌కు నివాళులు



నర్తకి సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

ప్రముఖ చలనచిత్ర నటులు, మాజీముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారకరామారావు 22వ వర్ధంతి సందర్భంగా ఈ నెల 18వ తేదీ నెల్లూరు జిల్లాలోని అన్ని ప్రాంతాలలో ఆయన చిత్రపటాలను ఏర్పాటు చేసి ఘన నివాళులు అర్పించారు. నెల్లూరు మినీబైపాస్ రోడ్డులోని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో లెజెండరీ బ్లడ్ డొనేషన్ క్యాంపును నిర్వహించారు. నెల్లూరు నర్తకి సెంటర్ వద్దనున్న ఎన్టీఆర్ విగ్రహానికి మాజీమంత్రి తాళ్ళపాక రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన అభిమానులు, నాయ కులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, నెల్లూరురూరల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఆదాల ప్రభాకర్ రెడ్డి, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తాళ్ళపాక అనూరాధ, జిల్లా మహిళా అధ్యక్షురాలు విజేత, జడ్.శివప్రసాద్, కొండ్రెడ్డి రంగారెడ్డి, మల్లి నిర్మల తదితరులు పాల్గొన్నారు. నెల్లూరు నగరంలోని ప్రధాన సెంటర్లు సంతపేట, ములుమూడి బస్టాండ్, స్టోన్‌హౌస్‌పేట, నవాబుపేట, ప్రగతి నగర్, నేతాజీనగర్, బారకాసు తదితర ప్రాంతాల్లో ఎన్టీఆర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి, అన్న దాన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలను ఆయన అభిమానులు, టిడిపి కార్యకర్తలు నిర్వహించారు.



ఆత్మకూరులో ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తెలుగుదేశం నాయకులు గూటూరు కన్నబాబు తదితరులు






Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com